# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 10 సంచిక : 17 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ మంగళవారం 22 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME 10 ISSUE :17 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA TUE 22 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## 2028 నాటికి కార్బన్ న్యూట్రల్‌గా కుప్పం

- కుప్పంలో వివిధ పథకాల లబ్ధిదారులతో సీఎం చంద్రబాబు ముఖాముఖి
- సూపర్ సిక్స్, సంజీవని పథకాల అమలు తీరుపై ఆరా
- త్వరలో రాష్ట్రవ్యాప్తంగా సంజీవని కార్యక్రమం విస్తరణకు ప్రణాళిక
- వ్యవసాయం, పర్యాటకం, మౌలిక వసతులపై అధికారులకు కీలక ఆదేశాలు

పెన్ పవర్ డెస్క్:ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పంలో విస్తృతంగా పర్యటించి, పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, క్షేత్రస్థాయిలో వాటి అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలు

- మిగతా 2లో





## టీచర్లపై దాడి నిందితులను వదిలిపెట్టం..


### మంత్రి లోకేశ్ మాస్ వార్నింగ్

- స్పోర్ట్స్ కోటా టీచర్లపై దాడికి దిగారంటూ లోకేశ్ ఆగ్రహం
- దైవం వంటి గురువులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరిక
- దేశానికి వన్నె తెచ్చిన క్రీడాకారులను జగన్ అవమానిస్తున్నారని ఆరోపణ
- రౌడీ షీటర్లు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను టీచర్లపైకి ఉసిగొల్పారని విమర్శ
- ప్రభుత్వ పాఠశాలలు, టీచర్ల జోలికి రావొద్దని హితవు

- మిగతా 2లో

## శబరిమలలో ప్రసాదం కొరత..

### హైకోర్టుకు వెళ్తానన్న మంత్రి




పెన్ పవర్ డెస్క్: సుప్రసిద్ధ శబరిమల అయ్యప్ప ఆలయంలో ప్రసాదం కొరతపై కేరళం ప్రభుత్వం, ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు మధ్య వివాదం ముదిరింది. భక్తులకు సరిపడా

- మిగతా 2లో



## విజయవాడలో 'శాప్' వద్ద ఉద్రిక్తత..

# టీచర్లు వర్సెస్ వైసీపీ..

### తోకలు కత్తిరిస్తానంటూ చంద్రబాబు ఫైర్

- విజయవాడ శాప్ కార్యాలయం వద్ద స్పోర్ట్స్ కోటా టీచర్లపై వైసీపీ నేతల దాడి యత్నం
- తమ నియామకాలు పారదర్శకమని చెప్పేందుకు వచ్చిన టీచర్లు.. అక్రమాలంటూ వైసీపీ నిరసన
- ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం, రౌడీయిజం చేస్తే తోకలు కత్తిరిస్తామని హెచ్చరిక
- గురువులపై దాడులను సహించబోమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టీకరణ
- ప్రతిపక్షానికి దమ్ముంటే ఆధారాలతో అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరిన ముఖ్యమంత్రి

పెన్ పవర్ డెస్క్:విజయవాడలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) కార్యాలయం వద్ద మెగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన ఉపాధ్యాయులపై వైసీపీ నేతలు దాడికి యత్నించారన్న ఆరోపణలపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కుప్పం పర్యటనలో ఉన్న ఆయన ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. రాష్ట్రంలో రౌడీయిజం, అరాచకాలను ఏమాత్రం ఉపేక్షించేది లేదని, అలాంటి చర్యలకు పాల్పడేవారి తోకలు కత్తిరిస్తామని హెచ్చరించారు. గురువులపై దాడులకు దిగడాన్ని ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని తీరుతామని స్పష్టం చేశారు.

**శాప్ కార్యాలయం వద్ద ఏం జరిగింది?**

మెగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ వైసీపీ నేతలు కొద్ది రోజులుగా విమర్శలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, తమ నియామకాలు అత్యంత పారదర్శకంగా జరిగాయని, తమ సర్టిఫికెట్లు, సాధించిన పతకాలు అన్నీ నిజమైనవని స్పష్టం చేసేందుకు స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన ఉపాధ్యాయులు సోమవారం విజయవాడలోని శాప్ కార్యాలయానికి చేరుకున్నారు. క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, శాప్ ఛైర్మన్, ఎండీలను కలిసి తమ

- మిగతా 2లో



## స్టాలిన్ ఓటమి నన్ను షాక్‌కు గురిచేసింది

- విజయ్ పాలనపై అప్పుడే మాట్లాడటం సరికాదన్న ప్రకాశ్ రాజ్
- బీజేపీ పతనానికి సమయం ఆసన్నమయిందని వ్యాఖ్య
- తనకు కూడా మోదీనే ప్రధానమంత్రి అన్న ప్రకాశ్ రాజ్


- మిగతా 2లో

## ఏపీలో జూడాలకు గుడ్ న్యూస్ చెప్పిన కూటమి ప్రభుత్వం

- ఏపీలో జూనియర్ డాక్టర్లు, హౌస్ సర్జన్ల స్టైఫండ్ పెంపు
- ఎంబీబీఎస్, బీడీఎస్ ఇంటర్న్‌లకు 10 శాతం పెరుగుదల
- పీజీ విద్యార్థులకు 5%, సూపర్ స్పెషాలిటీ వారికి 3.5% పెంపు
- ప్రభుత్వంపై ఏటా రూ.34.08 కోట్ల అదనపు ఆర్థిక భారం
- 2026 జనవరి 1 నుంచే పెంపు వర్తిస్తుందని ఉత్తర్వుల్లో వెల్లడి

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పనిచేస్తున్న జూనియర్ డాక్టర్లు, హౌస్ సర్జన్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారి స్టైఫండ్‌ను పెంచుతూ సోమవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది.

- మిగతా 2లో




## బంగాళాఖాతంలో వాయుగుండం..

# ఏపీలో 4 రోజులు భారీ వర్షాలు

- బంగాళాఖాతంలో అల్పపీడనం, వాయుగుండంగా బలపడే అవకాశం
- రాబోయే నాలుగు రోజులు రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు
- పలు కోస్తాంధ్ర జిల్లాలకు విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిక
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని సూచన
- లోతట్టు ప్రాంత ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశం

పెన్ పవర్ డెస్క్:బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో రాబోయే నాలుగు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. ప్రస్తుతం కేంద్రీకృతమై ఉన్న

- మిగతా 2లో






## చైనాకు భారత ఎగుమతులు జోరు..

### 40 శాతం వృద్ధి!

- చైనాకు భారీగా పెరిగిన భారత ఎగుమతులు
- గత ఐదు నెలల్లో దాదాపు 40 శాతం వృద్ధి నమోదు
- ఎలక్ట్రానిక్స్ వస్తువుల ఎగుమతుల్లో గణనీయమైన పెరుగుదల
- ఏఐ, డేటా సెంటర్ల వల్లే డిమాండ్ పెరిగిందంటున్న నిపుణులు
- అయినప్పటికీ వాణిజ్య లోటులో పెద్దగా మార్పు లేని వైనం

పెన్ పవర్ డెస్క్:భారత్ నుంచి చైనాకు ఎగుమతులు అనూహ్యంగా వృద్ధి చెందుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఐదు నెలల్లో (ఏప్రిల్–ఆగస్టు) చైనాకు భారత ఎగుమ తులు సుమారు

- మిగతా 2లో

## కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ కొనసాగుతున్న భూసర్వే..

### రంగంలోకి రెవెన్యూ అధికారులు

- ఎర్రవల్లిలో భూములపై కొనసాగుతున్న రెవెన్యూ సర్వే
- సర్వే నంబర్ 325పై అధికారుల ప్రత్యేక దృష్టి
- మొత్తం 388 ఎకరాల భూముల పరిశీలన
- శాటిలైట్ మ్యాపింగ్‌తో భూముల హద్దుల పరిశీలన
- ఆక్రమణలని తేలితే భూముల స్వాధీనానికి చర్యలు

- మిగతా 2లో



## మైసమ్మ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన పవన్ కల్యాణ్



- పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కల్యాణ్ పర్యటన
- ఫక్రుద్దీన్ పాలెంలో సుందరీకరించిన చెరువు ప్రారంభం
- పిఠాపురంలో రూ. 6 కోట్లతో 11 చెరువుల ఆధునీకరణ
- గ్రామాల్లో చెరువులను ఆహ్లాద, ఆరోగ్య కేంద్రాలుగా మార్చే ప్రణాళిక
- రాష్ట్రవ్యాప్తంగా రూ. 50 కోట్లతో 105 చెరువుల అభివృద్ధి

- మిగతా 2లో

## అఫ్ఘానిస్థాన్‌పై పాక్ వైమానిక దాడులు..

# 28 మంది మృతి..!





పెన్ పవర్ డెస్క్:అఫ్ఘానిస్థాన్‌పై సోమవారం పాకిస్థాన్ వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో 28 మంది ఉగ్రవాదులు మరణించినట్లు పాక్ ప్రకటించగా.. ముగ్గురు పౌరులు ప్రాణాలు కోల్పోయారని అఫ్ఘాన్ వెల్లడించింది. గత కొన్ని నెలలుగా

- మిగతా 2లో




## డాక్టరమ్మ ఆపరేషన్ సక్సెస్ చేస్తుందా? భీమిలీ నుంచి గట్టెక్కుతారా?

భీమిలి నియోజకవర్గ సమన్వయకర్తగా బొత్స అనూష ను నియమిస్తూ జగన్ నిర్ణయం తీసుకున్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాల మేరకు నియామకంజరిగినట్లు వైసీపీ నుంచి అధికారిక ప్రకటన తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం విడుదల చేసింది. భీమిలీ నియోజకవర్గ ఇన్ ఛార్జిగా... చిన్న శ్రీను పార్టీని వీడటంతో ఆయన స్థానంలో బొత్స అనూషను నియమించాలని జగన్ నిర్ణయించారు. మొన్న బొత్సతో సమావేశమై వన్ టూ వన్ చర్చించిన తర్వాత జగన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. భీమిలీ నియోజకవర్గం వైసీపీ ఇన్ ఛార్జిగా బొత్స అనూష వ్యవహరించనున్నారు. అయితే బొత్స అనూష ఎంపిక భీమిలి నియోజకవర్గంలో సరైన ఎంపికేనా? అన్న చర్చ జరుగుతుంది. అక్కడ బలమైన టీడీపీ నేత గంటా శ్రీనివాసరావు ఉన్నారు. అలాంటి చోట రాజకీయ అరంగ్రేట్రం చేస్తున్న బొత్స అనూష ఏ మేరకు విజయం సాధిస్తారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సొంత పార్టీలోనే ఈ రకమైన అభిప్రాయం వ్యక్తమవుతుంది.

**బొత్స వారసురాలిగా...**

బొత్స అనూష కాపు సామాజికవర్గం నేత కావచ్చు. బొత్స రాజకీయ వారసురాలిగా ఆమె రాజకీయ ఓనమాలు భీమిలి నుంచి నేర్చుకోవాల్సి ఉంది. తొలుత విజయనగరం జడ్పీ ఛైర్మన్ గా బొత్స అనూషను ఎంపిక చేయాలని నిర్ణయించారు. అయితే చిన్న శ్రీను పార్టీ మారిన తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో బొత్స అనూషకు భీమిలీ బాధ్యతలను అప్పగించడం సబబేనా? అన్న ప్రశ్న అందరిలోనూ కలుగుతుంది. తొలుత గుడివాడ అమర్నాథ్, మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు వంటి పేర్లను పరిశీలించినప్పటికీ వారికంటే కొత్త వారినే ఎంపిక చేయడం మంచిదని జగన్ భావించారు. అయితే భీమిలీలో కాపు సామాజికవర్గం ఓటర్లు ఎక్కువ. జనసేన, టీడీపీ కలసి ఉంటే అక్కడ నెగ్గుకు రావడం కష్టమే. ఈ పెను సవాల్ నుంచి ఈ డాక్టర్ బొత్స అనూష ఎలా బయటపడతారన్నది సందేహంగా మారింది.

**మజ్జి శ్రీనివాసరావు నిష్క్రమణతో ...**

ఇప్పటివరకు భీమిలి ఇన్ ఛార్జ్ గా ఉన్న మజ్జి శ్రీనివాసరావు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఆ స్థానాన్ని భర్తీ చేస్తూ పార్టీ శ్రేణులు చెల్లాచెదురు కాకుండా చూడటానికి జగన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉత్తరాంధ్రలో బొత్స కుటుంబానికి పట్టుంది. ఆయనకు వ్యక్తిగతంగా బలముంది. మరొకవైపు సీనియర్ నేత కావడం, కాపు సామాజికవర్గం కావడంతో ఆర్థికంగా, సామాజికవర్గం పరంగా బలంగా కనిపిస్తుంది. విజయనగరం, విశాఖపట్నం జిల్లాల రాజకీయాల్లో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కుటుంబానికి గట్టి పట్టుంది. బొత్స కుటుంబానికి చెందిన వ్యక్తిని ఇక్కడ పెట్టడం వల్ల స్థానిక క్యాడర్ కూడా కదలకుండా పార్టీ వైపే ఉంటుందని అధిష్టానం భావించింది. డాక్టర్ బొత్స అనూష వైద్య విద్యను అభ్యసించి, ఇటీవలే రాజకీయాల్లో యాక్టివ్ అవుతున్నారు. మహిళా, యువ కోటాలో ఆమెను రంగంలోకి దించడం ద్వారా ప్రతిపక్ష నేత గంటా శ్రీనివాసరావును ఢీకొట్టేందుకు వైసీపీ ఒక కొత్త అస్త్రాన్ని ప్రయోగించినట్లయింది. వాస్తవానికి బొత్స అనూష విజయనగరం జిల్లా పరిషత్ పీఠంపై ఆసక్తి చూపించగా, ఆమెను భీమిలికి పంపడంపై భిన్నమైన విశ్లేషణలు వస్తున్నాయి. అయినప్పటికీ, నియామకం జరిగిన వెంటనే బొత్స అనూష తన తండ్రి బొత్స సత్యనారాయణతో కలిసి స్థానిక క్యాడర్ ను కలుపుకుంటూ భీమిలిలో పార్టీ బలోపేతానికి పూర్తి స్థాయిలో రంగంలోకి దిగారు. మరి ఈ డాక్టర్ భీమిలిలో వైసీపీని ఎలా ఆపరేషన్ చేస్తారన్నది చూడాలి.

## శబరిమలలో ప్రసాదం కొరత..

- మొదటి పేజి తరువాయి

ప్రసాదం లేకపోవడంపై కేరళం మంత్రి మురళీధరన్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నిర్వహణ లోపం వల్లే ఇలాంటి పరిస్థితి తలెత్తిందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అవసరమైతే హైకోర్టుకు వెళ్తానని అన్నారు. ప్రసాదం కొరత ఏర్పడటంతో ఆదివారం పంపిణీని పరిమితం చేసిన సంగతి తెలిసిందే. ప్రతి యాత్రికుడు ఒక అరవణ పాయసం, మూడు అప్పం ప్యాకెట్లను మాత్రమే కొనుగోలు చేసేందుకు అనుమతిచ్చారు. ప్రసాదం కౌంటర్లను మధ్యాహ్నం 1.30కే మూసేశారు. తిరిగి 5 గంటలకు మళ్లీ తెరిచారు. దీంతో భక్తుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ తరహా పరిస్థితులు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా ఉండాలంటే.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని మంత్రి మురళీధరన్ అన్నారు. ముఖ్యమంత్రి వి.డి. సతీశన్‌తోనూ మాట్లాడి.. విచారణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని కోరనున్నట్లు చెప్పారు. అయితే, కన్ని నెలలో స్వామిని దర్శించుకునే భక్తుల కోసం దాదాపు 2.6 లక్షల డబ్బాల ప్రసాదాన్ని ముందే సిద్ధం చేసినట్లు దేవస్థానం అధికారులు చెబుతున్నారు. గతేడాది కంటే 50 వేల డబ్బాలు అధికంగానే తయారు చేశామని, సీజను ప్రారంభం కాకముందే భక్తుల సంఖ్య పెరిగిపోవడంతోనే ఈ సమస్య తలెత్తిందని తెలిపారు. సోమవారం నాటికి కేవలం 14 వేల డబ్బాలు మాత్రమే మిగిలి ఉన్నట్లు చెప్పారు. ప్రసాదం తయారీ కేంద్రాన్ని ఆధునీకరిస్తున్నందువల్లే కొరత ఏర్పడిందని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు చెబుతుండటంపై మంత్రి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా పనులు ఎలా చేపడతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శబరిమల యాత్ర నేపథ్యంలో.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదన్న ఉద్దేశంతో ముందస్తుగా ప్రసాదం తయారీ కేంద్రాన్ని ఆధునీకరిస్తున్నట్లు దేవస్థానం బోర్డు తెలిపింది.

## కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ కొనసాగుతున్న భూసర్వే.. రంగంలోకి రెవెన్యూ అధికారులు

సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామంలో మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసర భూములపై రెవెన్యూ అధికారులు సర్వే కొనసాగిస్తున్నారు. ఎర్రవల్లితో పాటు వెంకటాపూర్, వరదరాజుపూర్ సరిహద్దుల్లో ఉన్న భూములను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో నిలిచిన సర్వే.. సోమవారం ఉదయం తిరిగి ప్రారంభమైంది. సర్వే నంబర్ 325 పరిధిలో ఉన్న ప్రభుత్వ, అసైన్డ్ భూములపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. మొత్తం 388 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ భూముల్లో ప్రభుత్వ భూమి ఎంత? అసైన్డ్ భూమి ఎంత? ప్రస్తుతం ఎవరి అధీనంలో ఉంది? ప్రైవేటు పట్టా భూములు ఎంతమేర ఉన్నాయి? అనే వివరాలను సేకరిస్తున్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ సుదర్శన్ రాథోడ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సేవ్యానాయక్, గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, స్థానిక తహసీల్దార్లతో కూడిన ప్రత్యేక బృందాలు సర్వేలో పాల్గొంటున్నాయి. శాటిలైట్ మ్యాపింగ్, ఆధునిక సాంకేతికతతో పాటు పాత రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తూ భూముల హద్దులను నిర్ధారిస్తున్నారు. సర్వే నంబర్ 325 పరిధిలో భూములు ఉన్న 100 మందికి పైగా రైతులకు ఇప్పటికే అధికారులు నోటీసులు ఇచ్చారు. పట్టాదార్ పాస్‌పుస్తకాలు, ఇతర యాజమాన్య పత్రాలతో సర్వే ప్రాంతానికి రావాలని సూచించారు. ఫామ్‌హౌస్ పరిసర భూముల కేటాయింపులు, ధరణి రికార్డుల్లో అక్రమాలపై ఇటీవల అసెంబ్లీలో చర్చ జరిగిన నేపథ్యంలో ఈ విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. సర్వే పూర్తయ్యాక సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి అందజేయనున్నారు. ప్రభుత్వ లేదా అసైన్డ్ భూములు ఆక్రమణకు గురైనట్లు తేలితే.. నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

# 2028 నాటికి కార్బన్ న్యూట్రల్‌గా కుప్పం

- మొదటి పేజి తరువాయి

అందుకుంటున్న లబ్ధిదారులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. తల్లికి వందనం, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా వంటి పథకాల ద్వారా అందుతున్న ప్రయోజనాలు, వాటితో కుటుంబంలో వచ్చిన ఆర్థిక మార్పుల గురించి లబ్ధిదారులను సీఎం అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా, కుప్పంలోని యువ పారిశ్రామికవేత్తలతో సమావేశమై వారికి ప్రభుత్వ ప్రోత్సాహంపై భరోసా ఇచ్చారు. పైలట్ ప్రాజెక్టుగా అమలవుతున్న సంజీవని సేవల లబ్ధిదారులతో మాట్లాడి, పథకం పనితీరుపై ఆరా తీశారు. త్వరలోనే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "ప్రతి పేద కుటుంబానికి అండగా నిలవాలనే లక్ష్యంతో, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే మా ప్రభుత్వ ధ్యేయం" అని స్పష్టం చేశారు.

**అభివృద్ధి పనులపై సమీక్ష, అధికారులకు ఆదేశాలు**

కుప్పంలో జరుగుతున్న మౌలిక వసతుల కల్పనపై స్థానికులతో సీఎం చర్చించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, సీసీ రోడ్లు, తాగునీటి సరఫరా వంటి అంశాలపై ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. జల్ జీవన్ మిషన్ పనుల కోసం కొత్త రోడ్లు వేయడానికి ముందే పైప్‌లైన్లు వేయాలని, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి స్ట్రీట్ లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

**కుప్పం దేశానికే ఆదర్శం**

"2028 నాటికి కుప్పం నియోజకవర్గాన్ని కార్బన్ న్యూట్రల్‌గా మార్చడమే లక్ష్యం. ఈ ఏడాది డిసెంబరు నాటికి ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయాలి. వ్యర్థాలను సంపదగా మార్చి, పచ్చదనాన్ని 80 శాతానికి పెంచి కుప్పాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు. వ్యవసాయ వ్యయం తగ్గించి, రైతుల ఆదాయం పెంచేందుకు ప్రణాళికలు రచిస్తామని, పర్యాటకంగాను కుప్పాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. జీరో పావర్టీ కార్యక్రమంలో భాగంగా 2026 డిసెంబరు నాటికి నియోజకవర్గంలోని 8,904 'బంగారు కుటుంబాలను' ఆర్థికంగా ఆదుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు.

### విజయవాడలో 'శాప్' వద్ద ఉద్రిక్తత..
# టీచర్లు వర్సెస్ వైసీపీ..

- మొదటి పేజి తరువాయి

గోడు వెళ్లబుచ్చుకోవాలని, వినతిపత్రం సమర్పించాలని వారు భావించారు. అయితే, అదే సమయంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో శాప్ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసనకు దిగారు. డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో అక్కడే ఉన్న ఉపాధ్యాయులు కూడా తమకు న్యాయం చేయాలని, తమపై నిరాధార ఆరోపణలు మానుకోవాలని ప్రతి నినాదాలు ప్రారంభించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పోటాపోటీ నినాదాలతో ఆ ప్రాంతంలో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగప్రవేశం చేయాల్సి వచ్చింది.

**వైసీపీపై నిప్పులు చెరిగిన సీఎం చంద్రబాబు**

వైసీపీ రోజురోజుకూ మరింత దూకుడుగా, అరాచకంగా వ్యవహరిస్తోందని చంద్రబాబు మండిపడ్డారు. "విజయవాడలో గురువుల మీద రౌడీలు దాడులు చేస్తున్నారు. దీన్ని చూస్తూ ప్రభుత్వం నిశ్శబ్దంగా ఉండదు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని ఆయన అన్నారు. విజయవాడలో సాక్షి రిపోర్టర్ ప్రమేయంతో ఒక ఉపాధ్యాయుడిపై జరిగిందని, వైసీపీ తీరు అత్యంత దారుణంగా ఉందని విమర్శించారు. సమస్యలుంటే చట్టపరంగా న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చని, అంతేకానీ భౌతిక దాడులకు పాల్పడటం, ఉపాధ్యాయులపై రౌడీలను ఉసిగొల్పడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని హితవు పలికారు. గత ప్రభుత్వంలోనూ ఇదే విధంగా రౌడీయిజం, అరాచకాలతో పాలన సాగిందని, కుప్పంలో తనను సైతం అడ్డుకునే ప్రయత్నం చేశారని గుర్తుచేశారు. స్పోర్ట్స్ కోటా నియామకాలపై ప్రతిపక్షానికి దమ్ముంటే ఆధారాలతో అసెంబ్లీకి రావాలని, అక్కడ తమ వద్ద ఉన్న ఆధారాలతో వారి నోరు మూయిస్తామని సవాల్ విసిరారు. క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సైతం ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ పరిణామాలతో రాష్ట్ర రాజకీయాలు మరింత వేడెక్కాయి.

## టీచర్లపై దాడి నిందితులను వదిలిపెట్టం..

విజయవాడలో స్పోర్ట్స్ కోటా డీఎస్సీ-2025 టీచర్లపై దాడికి వైసీపీ ముఠాలు దాడికి దిగాయంటూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైసీపీపై తీవ్ర ఆరోపణలు చేస్తూ 'ఎక్స్'లో పోస్టు చేశారు. క్రీడాకారులుగా దేశానికి పేరు తీసుకొచ్చిన వారికి అన్యాయం చేయడం సరికాదని అన్నారు. దైవంలా భావించే టీచర్లపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

స్పోర్ట్స్ కోటాలో అవకతవకలు జరిగాయంటూ ఫేక్ ఆరోపణలు చేసినప్పుడే జగన్ దుర్బుద్ధి బయటపడిందని లోకేశ్ విమర్శించారు. క్రీడల్లో ప్రతిభ చూపించి టీచర్ ఉద్యోగాలు సాధించిన వారిని వైసీపీ అవమానిస్తోందని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలంటూ స్పోర్ట్స్ కోటా డీఎస్సీ-2025 టీచర్లు విజయవాడ శాప్ కార్యాలయం వద్ద అధికారులను కలిశారని లోకేశ్ తెలిపారు. ఈ సమయంలో వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులు టీచర్లపై దాడికి దిగారని ఆరోపించారు. రౌడీ షీటర్లు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను టీచర్లపైకి ఉసిగొల్పారని లోకేశ్ ఆరోపించారు. గురువులపై రాడ్లు, కర్రలతో దాడి చేయడం దారుణమని అన్నారు.

టీచర్లపై దాడి చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని లోకేశ్ స్పష్టం చేశారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, టీచర్ల జోలికి వైసీపీ రావడం మానుకోవాలని సూచించారు.

## మైసమ్మ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన పవన్ కళ్యాణ్

ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్ సోమవారం సొంత నియోజకవర్గంలో పర్యటించారు. ఫకృద్దీన్ పాలెం గ్రామంలోని మైసమ్మ చెరువు గట్టుపై వెలసిన మైసమ్మ అమ్మవారిని దర్శించుకుని, పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, గ్రామీణ చెరువులకు సరికొత్త రూపునిచ్చే బృహత్తర కార్యక్రమంలో భాగంగా రూ. 73 లక్షల వ్యయంతో సుందరీకరించిన మైసమ్మ చెరువును ప్రజలకు అంకితం చేశారు. గ్రామాల్లోని చెరువులను కేవలం నీటి వనరులుగా కాకుండా, ప్రజలందరికీ ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని పంచే సామాజిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ తెలిపారు. ఫకృద్దీన్ పాలెంలోని మైసమ్మ చెరువును రాష్ట్రానికే ఒక మోడల్‌గా అభివృద్ధి చేసినట్లు వివరించారు. చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్, ఓపెన్ ఎయిర్ జిమ్, పిల్లల పార్కును ఆయన ప్రారంభించారు. చెరువు గట్టుపై కలియదిరుగుతూ, అక్కడి వృక్షాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువు మధ్యలో నూతనంగా నిర్మిస్తున్న నందీశ్వరుడి సహిత శివుని విగ్రహాన్ని పరిశీలించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా చెరువు గట్టును బలోపేతం చేసి, పచ్చదనంతో నింపారు. ప్రజలు వ్యాయామం చేసుకునేలా ఓపెన్ జిమ్‌తో పాటు, జాతీయ భావాన్ని పెంపొందించేలా జెండా స్థూపాన్ని కూడా ఏర్పాటు చేశారు. చెరువు పక్కనే చిన్నారుల కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన పార్కును పిల్లలతో కలిసి ప్రారంభించిన పవన్ కళ్యాణ్, వారితో సరదాగా గడిపి చాక్లెట్లు పంచారు.

**రాష్ట్రవ్యాప్తంగా చెరువుల ఆధునీకరణ**

ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన (ర్రావీఖూ) నిధులతో రాష్ట్రవ్యాప్తంగా రూ. 50 కోట్లతో 105 చెరువుల సుందరీకరణ పనులు

చేపట్టినట్లు పవన్ కళ్యాణ్ వెల్లడించారు. ఒక్క పిఠాపురం నియోజకవర్గంలోనే రూ. 6 కోట్లతో 11 చెరువులను అభివృద్ధి చేస్తున్నామని, వీటికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కాకినాడ జిల్లా పరిధిలో అభివృద్ధి చేసిన 14 చెరువుల ఫొటో గ్యాలరీని తిలకించారు. ఈ నెలాఖరు నాటికి రాష్ట్రంలోని అన్ని చెరువుల పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

పర్యటనలో భాగంగా ఆయన గ్రామ సచివాలయాన్ని, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామస్తుల నుంచి వినతులు స్వీకరించి, వారి సమస్యలను ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

### బంగాళాఖాతంలో వాయుగుండం..
# ఏపీలో 4 రోజులు భారీ వర్షాలు

- మొదటి పేజి తరువాయి

అల్పపీడనం మంగళవారానికి వాయుగుండంగా బలపడనుందని, దీని ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు దంచికొడతాయని స్పష్టం చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. విపత్తుల నిర్వహణ సంస్థ అంచనాల ప్రకారం, మంగళవారం (సెప్టెంబర్ 22) నుంచి రాష్ట్రంలో వర్షాల తీవ్రత పెరగనుంది. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు, పోలవరం, విశాఖపట్నం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని, మిగిలిన కోస్తాంధ్ర జిల్లాల్లో మోస్తరు వర్షాలు, రాయలసీమ ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడతాయని తెలిపింది. బుధవారం (సెప్టెంబర్ 23) నాటికి వర్షాల ప్రభావం మరింత పెరగనుంది. అల్లూరి, పోలవరం, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో భారీ వర్షాలు, ఉత్తరాంధ్ర జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. గురు, శుక్రవారాల్లో సైతం కోస్తా జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు.. ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడతాయని వివరించింది. ఈ నేపథ్యంలో విపత్తుల నిర్వహణ సంస్థ కీలక హెచ్చరికలు జారీ చేసింది. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, అలల తీవ్రత ఎక్కువగా ఉంటుందని అంచనా వేసింది. అందువల్ల మత్స్యకారులు తదుపరి ఆదేశాలు వచ్చేవరకు వేటకు వెళ్లరాదని స్పష్టంగా సూచించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు, నదీ పరివాహక ప్రాంతాల వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది. ప్రజలు ఎప్పటికప్పుడు అధికారిక ప్రకటనలను గమనిస్తూ, అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## అఫ్గానిస్థాన్‌పై పాక్ వైమానిక దాడులు.. 28 మంది మృతి..!

- మొదటి పేజి తరువాయి

ఈ రెండు దేశాల మధ్య జరుగుతోన్న ఘర్షణల్లో ఇప్పటికే వందల సంఖ్యలో మరణాలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. తాజా వైమానిక దాడులు అఫ్గానిస్థాన్‌లోని కునార్, పక్తికా, ఖోస్త్ ప్రావిన్సులను లక్ష్యంగా చేసుకున్నాయని కాబూల్ అధికారులు వెల్లడించారు. దాడుల్లో పలు నివాసాలు ధ్వంసమయ్యాయన్నారు. పాక్ వైమానిక దాడులను తాలిబన్ ప్రధాన ప్రతినిధి జబీవుల్లా ముజాహిద్ తీవ్రంగా ఖండించారు. రోజురోజుకూ ఇస్లామాబాద్ దురాక్రమణలు పెరిగిపోతున్నాయని దుయ్యబట్టారు. దీనికి ప్రతీకారం తీర్చుకుంటామన్నారు. ఇటీవల పాక్‌లో జరిగిన పలు ఉగ్రదాడులకు ప్రతిస్పందనగా.. అఫ్గాన్‌పై దాడులు చేపడతామని ఆ దేశ సమాచార మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలోనే దాడులు చోటుచేసుకున్నాయి.

## స్టాలిన్ ఓటమి నన్ను షాక్‌కు గురిచేసింది

కొళత్తూరు నియోజకవర్గంలో డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ ఊహించని రీతిలో పరాజయం పాలవడం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ప్రముఖ సినీ నటుడు ప్రకాశ్ రాజ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో మార్పును ఆకాంక్షించే ప్రస్తుత ముఖ్యమంత్రి విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నుకున్నారని చెప్పారు. విజయ్ ప్రభుత్వ పాలనను అప్పుడే విమర్శించడం సరికాదని... కొత్త ప్రభుత్వానికి కనీసం ఏడాది సమయాన్నయినా ఇవ్వాలని అన్నారు. ఏడాది పాలన పూర్తయిన తాను స్పందిస్తానని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇప్పటికే సైలెంట్ మోడ్ లోకి వెళ్లిపోయిందని... వారి పతన సమయం ఆసన్నమైందని ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యానించారు. త్వరలోనే వారి విధానాల తప్పులకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. భవిష్యత్తులో రానున్న నియోజకవర్గాల పునర్విభజన బిల్లు దక్షిణాది రాష్ట్రాల పార్లమెంటరీ ప్రాతినిధ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని, దీనికి ఏ పార్టీ మద్దతు ఇచ్చినా తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. నరేంద్ర మోదీ తనకు వ్యక్తిగతంగా ఇష్టం లేదని, ఆయనకు తాను ఓటు వేయకపోయినా... తనకు కూడా ఆయనే ప్రధానమంత్రి అని చెప్పారు. అందుకే ప్రజా సమస్యలపై ఆయనను నిలదీసే హక్కు తనకు ఉందని స్పష్టం చేశారు.

## ఏపీలో జూడాలకు గుడ్ న్యూస్ చెప్పిన కూటమి ప్రభుత్వం

- మొదటి పేజి తరువాయి

పెంచిన స్టైఫండ్ 2026 జనవరి 1వ తేదీ నుంచి వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ.34.08 కోట్ల అదనపు భారం పడనుంది. వివరాల్లోకి వెళితే, తమ పనిభారానికి తగినట్లుగా స్టైఫండ్ పెంచాలని జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ (జూడా) కొంతకాలంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వారి డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని స్టైఫండ్ పెంపునకు ఆమోదం తెలిపింది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, ఎంబీబీఎస్, బీడీఎస్ హౌస్ సర్జన్లకు 10 శాతం స్టైఫండ్ పెంచారు. దీంతో వారి నెలవారీ స్టైఫండ్ రూ.28,497కి చేరింది. అదేవిధంగా, పీజీ డిగ్రీ, డిప్లొమా కోర్సులు చేస్తున్న వైద్య విద్యార్థులకు 5 శాతం, సూపర్ స్పెషాలిటీ కోర్సులు అభ్యసిస్తున్న వారికి 3.5 శాతం చొప్పున స్టైఫండ్‌ను పెంచారు. ఈ పెంపు నిర్ణయం ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ మెడిసిన్, సూపర్ స్పెషాలిటీ, ఎండీఎస్, డీఎన్‌బీ విద్యార్థులందరికీ వర్తిస్తుంది. జూనియర్ డాక్టర్ల ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల వైద్య విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## చైనాకు భారత ఎగుమతులు జోరు.. 40 శాతం వృద్ధి!

- మొదటి పేజి తరువాయి

40 శాతం మేర పెరిగాయి. ముఖ్యంగా 'మేడ్ ఇన్ ఇండియా' ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులు ఈ వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయినప్పటికీ, ఇరు దేశాల మధ్య వాణిజ్య లోటు ఇప్పటికీ చైనాకు అనుకూలంగా కొనసాగుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో చైనాకు భారత ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు మూడు రెట్లు పెరిగి 3.18 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. స్మార్ట్‌ఫోన్లు, ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డులు, డిస్‌ప్లే మాడ్యూల్స్ వంటివి వీటిలో ప్రధానమైనవి. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-ఆగస్టు మధ్య కాలంలోనూ ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 15 శాతానికి పైగా పెరిగాయి. ఇదే సమయంలో ఇంజినీరింగ్ వస్తువుల ఎగుమతులు సైతం 21 శాతం మేర వృద్ధిని నమోదు చేశాయి. అంతర్జాతీయంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా సెంటర్ల కోసం అత్యాధునిక పరికరాలకు డిమాండ్ పెరగడమే ఈ వృద్ధికి ప్రధాన కారణమని పరిశ్రమ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. "ప్రపంచంలోనే అత్యంత పోటీతత్వంతో కూడిన సరఫరా వ్యవస్థలో భారత తయారీ రంగం తన విశ్వసనీయతను చాటుకుంటోంది" అని ఇండియన్ సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ ఛైర్మన్ పంకజ్ మోహింద్రూ పేర్కొన్నారు.

అయితే, ఈ వృద్ధి స్వల్ప స్థాయి నుంచి ప్రారంభమవడంతో చైనాతో నెలకొన్న భారీ వాణిజ్య లోటుపై చెప్పుకోదగ్గ ప్రభావం చూపలేదు. గత ఆర్థిక సంవత్సరంలో చైనా నుంచి భారత్ దిగుమతులు 131.6 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ప్రస్తుతం భారత ఎగుమతులకు అమెరికానే అతిపెద్ద మార్కెట్‌గా కొనసాగుతోంది.

# బాలగణపతిని దర్శించుకున్న శరకణం రాజబాబు.

**కిర్లంపూడి, పెన్ పవర్, సెప్టెంబర్, 21:** కిర్లంపూడి మండలం జగపతినగరం శ్రీరామ్ నగర్‌లో ఏర్పాటు చేసిన బాల గణపతిని కిర్లంపూడి మండలం భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు శరకణం రాజబాబు సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ వినాయకుడిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని గణనాథుడిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు



పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# సువర్ణ రామచంద్రపురం నిర్మాణమే లక్ష్యం





**కాజులూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 21:** రామచంద్రపురం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సోమవారం కాజులూరు మండలంలో అధికారులు, కూటమి పార్టీ నాయకులతో నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యలపై మంత్రి సమగ్ర సమీక్ష నిర్వహించారు. మండలంలోని ప్రతి గ్రామంలో పూర్తయిన అభివృద్ధి పనులు, జరుగుతున్న పనులు, చేపట్టాల్సిన భవిష్యత్ కార్యక్రమాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులతో మంత్రి సమీక్షించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యల్లో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించగా, మిగిలిన వాటిపై సమగ్ర నివేదికలు సిద్ధం చేసి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గంలో ఇప్పటివరకు సుమారు రూ. 270 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ నిధులతో పాటు సీఎస్ఆర్ నిధులను సమీకరించి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామం అభివృద్ధి చెందే వరకు కృషి కొనసాగుతుందని స్పష్టం చేశారు.

సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా విద్య, వైద్యం, ఉపాధి, మహిళా సాధికారత, దివ్యాంగుల సంక్షేమం తదితర రంగాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పెన్షన్ల కోసం అందిన దరఖాస్తులను పరిశీలించి అర్హులకు పెన్షన్లు మంజూరు చేస్తామని, అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని వెల్లడించారు. రామచంద్రపురం నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో రాష్ట్రానికి ఆదర్శంగా నిలిపి, సువర్ణ రామచంద్రపురం నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని మంత్రి సుభాష్ పేర్కొన్నారు.

కార్యక్రమంలో తహసీల్దార్ జి. రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంపీడీవో జె. రాంబాబు, జేఈ భవాని శంకర్, రూప, ప్రదీప్, అగ్రికల్చర్ ఏవో అశోక్, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, టీడీపీ మండల అధ్యక్షుడు చవ్వాకుల నారాయణ మూర్తి, జనసేన మండల అధ్యక్షుడు బొండా వెంకన్న, అన్యం శ్రీరాం, సొసైటీ అధ్యక్షుడు బొండా వెంకట నరసింహనాయుడు, పితాని సతీష్, ఏఎంసీ వైస్ చైర్మన్ దడాల నాగార్జున, సలాది సాయిబాబు, పితాని సతీష్, పేపకాయల బాబ్జీ, వనుం వీర బ్రహ్మ, పోతుల గనిరాజు, చందాల మల్లిబాబుతో పాటు వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పిఠాపురంలో అభివృద్ధి పనులకు శ్రీకారం





- పిఠాపురంలో అభివృద్ధి పనులకు శ్రీకారం
- రూ.73 లక్షలతో మైసమ్మ చెరువు, చిల్డ్రన్స్ పార్క్ ప్రారంభం
- రూ.1.83 కోట్లతో అభివృద్ధి చేసిన 'పీఠికాపుర వనం' ప్రారంభించిన పవన్ కళ్యాణ్

**పెన్ పవర్ ప్రతినిధి, కాకినాడ(పిఠాపురం): సెప్టెంబర్ ,21** పిఠాపురం నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ--పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ సోమవారం ప్రారంభించారు. పిఠాపురం మండలం ఎఫ్.కె.పాలెంలో రూ.73 లక్షలతో అభివృద్ధి చేసిన మైసమ్మ చెరువు, వాకింగ్ ట్రాక్, ఓపెన్ ఎయిర్ జిమ్, చిల్డ్రన్స్ పార్క్, జెండా స్థూపాన్ని ప్రారంభించారు. చెరువు గట్టును బలోపేతం చేయడంతో పాటు పచ్చదనాన్ని పెంపొందించారు. చిల్డ్రన్స్ పార్కులో ఆడుకుంటున్న చిన్నారులకు పవన్ కళ్యాణ్ చాక్లెట్లు, తినుబండారాలు అందించారు. చెరువు పరిసరాల్లోని భారీ వృక్షాల వయసు, వాటి శాస్త్రీయ నామాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో రూ.6 కోట్లతో 11 చెరువుల సుందరీకరణ పనులు చేపట్టగా, వాటికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కాకినాడ జిల్లాలో అభివృద్ధి చేసిన 14 చెరువుల వివరాలతో ఏర్పాటు చేసిన గ్యాలరీని పరిశీలించారు. ప్రధానమంత్రి కృషి సించాయి యోజన (పీఎంకేఎస్‌వై) సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా రూ.50 కోట్లతో 105 చెరువుల సుందరీకరణ పనులు చేపట్టినట్లు అధికారులు వివరించారు. వీటిలో సగానికి పైగా పనులు పూర్తయ్యాయని, మిగిలినవి పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ఈ నెలాఖరులోగా అన్ని పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. అనంతరం మైసమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టువస్త్రాలు సమర్పించారు. చెరువు మధ్యలో ఏర్పాటు చేస్తున్న నందీశ్వరుడితో కూడిన శివుని విగ్రహాన్ని పరిశీలించారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు వినాయకుడి ఆలయాన్ని సందర్శించి, వారి నుంచి సమస్యలపై వినతులు స్వీకరించారు. గ్రామ సచివాలయం, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించి, పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు.

### పీఠికాపుర వనం ప్రారంభం

పిఠాపురం పట్టణంలో రూ.1.83 కోట్లతో ఆరు ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన 'పీఠికాపుర వనం' (నగరవనం)ను పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. గతంలో డంపింగ్ యార్డుగా ఉన్న ప్రాంతాన్ని హరిత ప్రదేశంగా అభివృద్ధి చేసినట్లు అధికారులు వివరించారు. పవన్ కళ్యాణ్ మొక్క నాటి అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పిఠాపురం ఆధ్యాత్మిక ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని నగరవనంలో నక్షత్రవనం, శివ పంచాయతన వనాలను ఏర్పాటు చేశారు. 27 నక్షత్రాలకు ప్రతీకగా వివిధ రకాల మొక్కలను నాటి, వాటి శాస్త్రీయ, వాడుక పేర్లతో బోర్డులు ఏర్పాటు చేశారు. శివ పంచాయతన వనంలో మారేడు, వినాయకుడు, విష్ణువు, అమ్మవారు, సూర్య భగవానుడికి సంబంధించిన మొక్కలను ఏర్పాటు చేశారు. 70 సెంట్ల విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన మియావకీ ప్లాంటేషన్, బటర్‌ఫ్లై పార్కు, నగరవనం మధ్యలోని కొలనును పవన్ కళ్యాణ్ పరిశీలించారు. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ మొక్కలను పెంచేలా మియావకీ పద్ధతిలో ప్లాంటేషన్ ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. బాక్స్ క్రికెట్, ప్లే కోర్ట్స్ వంటి సౌకర్యాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. గతంలో డంపింగ్ యార్డుగా ఉన్న ప్రాంతం నగరవనంగా రూపాంతరం చెందిన తీరును వివరించే ఫొటో గ్యాలరీని పవన్ కళ్యాణ్ పరిశీలించారు. నగరవనం అభివృద్ధికి కృషి చేసిన అధికారులను అభినందించి, పిఠాపురానికి వచ్చే భక్తులు, ప్రజలకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. నగర్ వన్ యోజన పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా రూ.36 కోట్లతో 18 నగరవనాలను అభివృద్ధి చేసి ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, పీసీసీఎఫ్ పి.వి.చలపతిరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# కిర్లంపూడి రమణయ్యపేటలో భక్తిశ్రద్ధలతో దీపోత్సవం

**కిర్లంపూడి, పెన్ పవర్, సెప్టెంబర్, 21:** కాకినాడ జిల్లా మండల కిర్లంపూడి మండలం రమణయ్యపేటలో దొడ్డి ముసలయ్య ఇంటి సమీపంలో ఏర్పాటు చేసిన బాల వినాయకుడి మండపం వద్ద శివునికి ప్రీతిపాత్రమైన సోమవారం సందర్భంగా బాల వినాయక యూత్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో దీపోత్సవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మండపం ప్రాంగణంలో శివలింగం, వినాయక లింగం, స్వస్తిక్ ఆకృతులను రంగులతో తీర్చిదిద్ది వాటి చుట్టూ దీపాలను వెలిగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆధ్యాత్మిక వాతావరణంలో దీపోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# లింగంపాటి చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు!





**పట్టపగలే మట్టి తరలింపు.. ప్రభుత్వ ఆదాయానికి గండి?**

**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్, 21** గండేపల్లి మండలంలో మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని ఎన్.టి. రాజాపురం గ్రామ శివారులోని కే. గోపాలపురం వెళ్లే మార్గంలో ఉన్న లింగంపాటి చెరువులో సోమవారం అనుమతులు లేకుండానే మట్టి తవ్వకాలు చేపట్టినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. చెరువులో భారీగా మట్టి తవ్వకాలు జరుపుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎటువంటి అనుమతులు, ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా మట్టి తరలిస్తే ప్రభుత్వ ఆదాయానికి గండిపడటంతో పాటు చెరువుల పరిరక్షణకు విఘాతం కలుగుతుందని వారు పేర్కొంటున్నారు. వర్షాకాల పరిస్థితులను ఆసరాగా చేసుకుని చెరువులు, కుంటల్లో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. మట్టి తవ్వకాలకు అనుమతులు ఉన్నాయా? లేక అక్రమంగా తవ్వకాలు జరుగుతున్నాయా? అనే విషయంపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. లింగంపాటి చెరువులో జరుగుతున్న మట్టి తవ్వకాలపై సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. తాసిల్దార్ వారిని ఫోన్లో వివరణ కోరగా: చెరువులు తమ పరిధి కాదని ఇరిగేషన్ డిపార్ట్మెంట్ వారిదని వారికి సమాచారం తెలియపరవాల్సిందిగా తెలియజేశారు.

# ఘనంగా దర్బార్ సేవ



**ఆలమూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 21:** గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలమూరు పాపయ్య కాలనీలో ఏర్పాటుచేసిన గణేష్ మండపం వద్ద సోమవారం దర్బార్ సేవ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. లక్ష్మీనారాయణ దంపతుల చేతులమీదుగా అర్చకులు అంగర సింగు బాబు ప్రత్యేక పూజలు చేయించి వేదపారాయణం, ఊంజల్ సేవ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

## ఆత్రేయపురం మండల పరిషత్ చివరి సర్వసభ్య సమావేశం




**ఆత్రేయపురం, పెన్ పవర్ సెప్టెంబర్ 21:** ఆత్రేయపురం మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ చివరి సర్వసభ్య సమావేశం సోమవారం అధ్యక్షురాలు కుండా అన్నపూర్ణ అధ్యక్షతన ఆత్మీయ వాతావరణంలో జరిగింది. మండలంలో కొనసాగుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల పదవీకాలం ఈ నెల 24తో ముగియనున్న నేపథ్యంలో ఎంపీడీవో పి.వి.ఆర్.కె. రాజు, మండల పరిషత్ పరిపాలనాధికారి వి. రామస్వరూప్ ఆధ్వర్యంలో అధ్యక్షురాలు, సభ్యులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు కుండా అన్నపూర్ణ తన పదవీకాలంలో సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రౌతులపూడి గ్రామం లో పర్యటించిన ముద్రగడ గిరిబాబు...



**శంఖవరం/ రౌతులపూడి పెన్ పవర్ సెప్టెంబర్ 21:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం రౌతులపూడి మండలం రౌతులపూడి గ్రామం లో ప్రతిపాడు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు ఈరోజు రౌతులపూడి గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. వైఎస్సార్సీపీ జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకులు వాసిరెడ్డి జమీల్ మరియు ప్రముఖ నాయకులు వాసిరెడ్డి భాస్కర్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రౌతులపూడి నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. కార్యకర్తల నుండి ముఖ్య నాయకుల వరకు అందరినీ కలుసుకొని, రాబోయే రోజుల్లో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంపై దిశానిర్దేశం చేశారు. కార్యకర్తల సలహాలు, సూచనలను స్వీకరిస్తూ పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో భారీ స్థాయిలో వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా గురజాడ 199వ జయంతి

**ఎంపీడివో రాజు, తహసీల్దార్ కుశరాజు ఘన నివాళులు**



**ఆలమూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 21:**తెలుగు సాహిత్య పితామహుడు,మహాకవి, సామాజిక సంస్కర్త, గ్రాంథిక భాషకే పరిమితమైన తెలుగు సాహిత్యాన్ని సామాన్య ప్రజల వాడుక భాష వైపు మళ్లించి, ఆధునిక కవిత్వానికి, నాటక రంగానికి కొత్త దిశ చూపిన గురజాడ అప్పారావు 199వ జయంతి ఘనంగా జరిగింది. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గురజాడ జయంతి వేడుకల్లో ఎంపీడీఓ ఏ రాజు, తహసీల్దార్ కె.కుశరాజు, ఎంఇఓ బి అప్పాజీ ఆధ్వర్యంలో అధికారుల బృంద సభ్యులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక దృక్పథమే ధ్యేయంగా ?స్త్రీ విద్య, సమాజ శ్రేయస్సు, మానవత్వ విలువలకు గురజాడ అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన మహనీయుడని కొనియాడారు మూఢనమ్మకాలను వ్యతిరేకిస్తూ, సమసమాజ స్థాపనకు తన రచనల ద్వారా విశేష కృషి చేశారన్నారు. గురజాడ చూపిన బాట ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో ఒక నూతన శకానికి పునాది వేసిందన్నారు. అనంతరం వారందరూ గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. పరిపాలన అధికారి ఎంఎం ప్రకాష్,ఏపీఓ జి.అరుణకుమారి, ఐసీడీఎస్ సూపర్వైజర్ బి.వరలక్ష్మి, ఇరిగేషన్ జెఏ యూ రేవతి, హౌసింగ్ జెఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మెడికవర్ హాస్పిటల్స్‌లో నూతన క్యాన్సర్ వింగ్ ప్రారంభం



**కాకినాడ రూరల్, పెన్ పవర్ సెప్టెంబర్ 21:** మెడికవర్ హాస్పిటల్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన క్యాన్సర్ వింగ్‌ను మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీఎస్ఎన్ వర్మ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు అత్యాధునిక క్యాన్సర్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చిట్నీడి శ్రీనివాస్, జనసేన నాయకులు దుగ్గన బాబ్జీ క్యాన్సర్ వింగ్‌ను సందర్శించి ఆసుపత్రి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు.క్యాన్సర్ నిర్ధారణ నుంచి చికిత్స వరకు మెడికల్, సర్జికల్, రేడియేషన్ ఆంకాలజీ విభాగాల సమన్వయంతో సమగ్ర వైద్య సేవలు అందిస్తామని సెంటర్ హెడ్ ఎన్. అంజిబాబు తెలిపారు.క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి సకాలంలో సరైన చికిత్స తీసుకోవాలని వైద్యులు డాక్టర్ మురళీధర్, డాక్టర్ పృధ్వీరాజ్, డాక్టర్ ప్రదీప్ భాస్కర్, డాక్టర్ సమంత్ కుమార్, డాక్టర్ శివభరత్ సూచించారు. నూతన క్యాన్సర్ వింగ్ ద్వారా కాకినాడతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన క్యాన్సర్ వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయని తెలిపారు.కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆదిత్య యూనివర్సిటీలో మానసిక ఆరోగ్యంపై అవగాహన





### 'నావిగేటింగ్ హోప్, హెల్ప్ అండ్ హీలింగ్ టుగెదర్

**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 21:**గండేపల్లి మండలం సూరంపాలెం విద్యార్థుల మానసిక ఆరోగ్యం, భావోద్వేగ శ్రేయస్సుపై అవగాహన కల్పించేందుకు ఆదిత్య యూనివర్సిటీలో 'నావిగేటింగ్ హోప్, హెల్ప్ అండ్ హీలింగ్ టుగెదర్' కార్యక్రమాన్ని నిర్వహించారు. స్టూడెంట్ కౌన్సెలింగ్ అండ్ వెల్‌బీయింగ్ కమిటీ, వెల్‌బీయింగ్ సెంటర్ ఆధ్వర్యంలో 'స్ట్రాంగ్ మైండ్స్--బ్రైటర్ టుమారోస్' అనే సందేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వైస్‌ఛాన్సలర్ డా. ఎం.బి. శ్రీనివాస్, డిప్యూటీ ప్రో-ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాసరెడ్డి, రిజిస్ట్రార్ డా. జి. సురేష్, ప్రో వైస్‌ఛాన్సలర్ (ఇంజినీరింగ్ అండ్ సైన్సెస్) డా. ఎ. రమేష్, డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ డా. వై. కృష్ణ శ్రీనివాస సుబ్బారావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యం, భావోద్వేగ శ్రేయస్సు కోసం యూనివర్సిటీ అందిస్తున్న సహకారం, సమస్యలు ఎదురైనప్పుడు సకాలంలో సహాయం పొందడం ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థులకు అవసరమైన మార్గదర్శకత్వం, కౌన్సెలింగ్, సహాయాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన వెల్‌బీయింగ్ సెంటర్ సేవలను వివరించారు. కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా హాజరైన డా. చల్లా ఎస్.వి. కృష్ణ వాసన్ మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నిర్వహణ, భావోద్వేగ సమతుల్యత, సమస్యలను సకాలంలో గుర్తించడం, అవసరమైనప్పుడు నిపుణుల సహాయం పొందడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మానసిక ఆరోగ్యంపై ఉన్న అపోహలను తొలగించడం, తమ సమస్యలను స్వేచ్ఛగా పంచుకోవడం, అవసరమైన సమయంలో సహాయం కోరడం ప్రాధాన్యతను ఆయన వివరించారు. విద్యార్థులకు వ్యక్తిగతంగా అవసరమైన సహాయం, మార్గదర్శకత్వం అందించేందుకు కౌన్సిలర్ ఎస్. సోహెల్ అందుబాటులో ఉంటారని నిర్వాహకులు తెలిపారు.విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, మానసిక ఆరోగ్యం, శ్రేయస్సు కోసం భవిష్యత్తులోనూ ఇటువంటి అవగాహన కార్యక్రమాలను కొనసాగిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.

## భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక పర్యవేక్షణ

**సత్రాల్లో వసతి, పారిశుద్ధ్యంపై అధికారుల దృష్టి**





**పెన్ పవర్ ప్రతినిధి, కాకినాడ (అన్నవరం), సెప్టెంబర్ 21:** భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రధాన లక్ష్యంగా కాకినాడ జిల్లా అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టారు. సోమవారం సత్యగిరి కొండపై భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వివిధ సత్రాలు, ఇతర ప్రాంతాలను దేవస్థానం కార్యనిర్వహణాధికారి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సత్రాల్లో భక్తులకు అందుతున్న వసతి, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. భక్తులకు మరింత మెరుగైన వసతి, అవసరమైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. సత్రాలు, పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరచాలని, అదనపు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అనంతరం వేద పాఠశాలను సందర్శించిన కార్యనిర్వహణాధికారి అక్కడ విద్యార్థులకు అందిస్తున్న భోజనం, అల్పాహార సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన, రుచికరమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వసతి, పారిశుద్ధ్యం, ఆహార నాణ్యత తదితర అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. భక్తుల సంతృప్తికి ప్రాధాన్యతనిస్తూ దేవస్థానం తరపున అవసరమైన చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.

## పోషణ మాసోత్సవాల్లో అవగాహన కార్యక్రమం



**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 21:**కొత్తపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ఏ. గజలక్ష్మి ఆధ్వర్యంలో ఉచ్చిలి ఎస్సీ ఏరియా అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. సెప్టెంబర్ 16 నుంచి 21 వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా "మన అంగన్‌వాడీ -- మన బాధ్యత" థీమ్‌తో అంగన్‌వాడీ కేంద్రాల్లో వేడి భోజనం కార్యక్రమంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సీడీపీవో ఏ. గజలక్ష్మి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం ఎంతో అవసరమన్నారు. ధాన్యాలు, చిరుధాన్యాలు, పాలు, గుడ్లు, పండ్లు, కూరగాయలతో పాటు ముఖ్యంగా మునగాకు వినియోగం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం ఆహారం అందించడం, వంటశాల పరిశుభ్రత, ఆహార భద్రతపై అవగాహన కల్పించారు.సూపర్‌వైజర్ కె. పద్మావతి, ఏఎన్ఎం ప్రశాంతి, అంగన్‌వాడీ కార్యకర్తలు సత్యనారాయణమ్మ, పల్లెలో యమ్మ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం పోషణ మాస ప్రతిజ్ఞ చేయించారు.

## గురజాడ రచనలు సమాజానికి మార్గదర్శకం




### అసిస్టెంట్ ప్రొఫెసర్ తేజేశ్వరరావు

**కాకినాడ, పెన్ పవర్ సెప్టెంబర్ 21:** స్థానిక ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకుని ఆయన రచనలు, సామాజిక చైతన్యంపై సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు గురజాడ సాహిత్యం,సామాజిక చైతన్యం, మానవతా విలువలు, 'కన్యాశుల్కం' నాటకం ద్వారా ఆయన చేపట్టిన సంఘ సంస్కరణలపై అవగాహన కల్పించారు.తెలుగు విభాగం డీన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ తేజేశ్వరరావు మాట్లాడుతూ గురజాడ రచనలు సమాజంలోనిమూఢనమ్మకాలు, సామాజిక అసమానతలను ప్రశ్నిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చాయని అన్నారు. "దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్" అనే గురజాడ భావన నేటికీ సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. విద్యార్థులు గురజాడ రచనల విశిష్టతను తెలుసుకుని, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని నిర్వహించిన తెలుగు విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు అభినందించారు.

## చిన్నారి వైద్యానికి మంత్రి సుభాష్ మానవతా హస్తం



**రామచంద్రపురం, పెన్ పవర్ సెప్టెంబర్ 21:** అరుదైన బ్లడ్ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న చిన్నారి మహిశ్రీ వైద్యానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మానవతా దృక్పథంతో అండగా నిలిచారు. రామచంద్రపురం రూరల్ మండలం అన్నయ్యపేటకు చెందిన దవల వెంకటేశ్వరరావు, కరుణజ్యోతి దంపతుల కుమార్తె మహిశ్రీ అనారోగ్యంతో బాధపడుతోంది. చికిత్సలో భాగంగా ప్రతినెల రెండు ఖరీదైన ఇంజక్షన్లు అవసరమని వైద్యులు సూచించగా, ఒక్కో ఇంజక్షన్‌కు సుమారు రూ.22 వేలు ఖర్చవుతుండటంతో పేద కుటుంబానికి ఆర్థిక భారం ఏర్పడింది.చిన్నారి పరిస్థితిని కూటమి పార్టీ నాయకులు సలాది శ్రీను ద్వారా తెలుసుకున్న మంత్రి సుభాష్ వెంటనే స్పందించి, వైద్యానికి అవసరమైన రెండు ఇంజక్షన్లను రూ.44 వేలతో కొనుగోలు చేసి కుటుంబ సభ్యులకు అందించారు. భవిష్యత్తు లోనూ వైద్యానికి అవసరమైన సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. "ఆందోళన చెందవద్దు.. నేనున్నాను" అంటూ చిన్నారి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు.

తమ కష్టకాలంలో అండగా నిలిచి చిన్నారి వైద్యానికి సహాయం చేసిన మంత్రి సుభాష్‌కు మహిశ్రీ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి వెంట జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, రూరల్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనుబాబు,రాష్ట్ర బీసీ సెల్ నాయకులు పెంకే సాంబశివరావు, సలాది శ్రీను తదితరులు ఉన్నారు.

# పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేనలోకి 32 మంది వైసీపీ నేతలు - పిఠాపురంలో భారీ చేరికలు







**పెద్దాపురం.. పెన్ పవర్ ..సెప్టెంబర్ 21:**జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారి సమక్షంలో పిఠాపురంలో ఈరోజు భారీ చేరికలు జరిగాయి.

పెద్దాపురం, , సామర్లకోట, నియోజకవర్గాలకు చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, సామర్లకోట మాజీ తాజా మున్సిపల్ చైర్మన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి, వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి మాజీ మున్సిపల్ చైర్మన్, నెక్కంటి సాయి ప్రసాద్, మాజీ వైస్ చైర్మన్లు కనకాల సుబ్రహ్మణ్యం మహాలక్ష్మి, సత్య భాస్కర్, మాజీ కౌన్సిలర్లు సహా మొత్తం 32 మంది ముఖ్య నేతలు వైసీపీని వీడి పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ గారు వారికి జనసేన కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

**పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేనలో చేరిన 32 మంది:**

1. వరుపుల సుబ్బారావు -- మాజీ ఎమ్మెల్యే

2. పాంపన రామకృష్ణ,3. నెక్కంటి సాయి ప్రసాద్ మాజీ మున్సిపల్ చైర్మన్,4. విజ్జపు రాజశేఖర్,5. త్సాలికి భాస్కరరావు
6. కొట్టి కిషోర్ పవన్,7. గుర్రాల మూర్తి,8. వాసంశెట్టి గంగ
9. అరెల్ల వీర రాఘవులు,10. నీలంసెట్టి అమ్మాజీ,11. కట్టా రాజాబాబు,12. యండమూరి విజయలక్ష్మి,13. చింత శ్రీనివాసరావు,14. కోటి మల్లిబాబు,15. కురమదాస్ సతీష్ కుమార్,16. గంగిరెడ్డి అరుణ -- మాజీ మున్సిపల్ చైర్మన్, సామర్లకోట,17. గంగిరెడ్డి కృష్ణమూర్తి,18. చల్లపల్లి వెంకట సత్యనారాయణ (లాయర్ శ్రీను),19. వేగి సత్యనారాయణ
20. చాడలాడ రాజ్ కుమార్ (బాబీ),21. జోకా వెంకట శ్రీనివాస్ విజయ్ కుమార్,22. వి.వి.ఎస్. సూరిబాబు,23. వి. రాజాబాబు
24. గాబు కృష్ణ,25. కనకాల మహాలక్ష్మి -- మాజీ వైస్ చైర్మన్, పెద్దాపురం,26. కనకాల సుబ్రహ్మణ్యం,27. తాడి రాజశేఖర్
28. జల్లో డేవిడ్,29. పిన్నింటి రాము,30. పల్లె రాజు
31. నదిమింటి వెంకటరాజు,32. బి. అలీషా....

ఈ జనసేన పార్టీ చేరుకులో కొణిదెల పవన్ కళ్యాణ్ గారితో పాటు కాకినాడ పార్లమెంట్ సభ్యులు శ్రీ తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్ గారు, కాకినాడ రూరల్ శాసనసభ్యులు శ్రీ పంతం నానాజీ గారు, చైర్మన్లు వేగుళ్ల లీలా కృష్ణ గారు తలాటం సత్య గారు, తోట సుధీర్ గారు, పై మాన్ కమిటీ సభ్యులు పెండెం దొరబాబు గారు, ఓదురి కిషోర్ గారు పాల్గొన్నారు







# జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో భారీగా చేరికలు





**పెద్దాపురం.. పెన్ పవర్... సెప్టెంబర్ 21...**పెద్దాపురం నియోజకవర్గానికి సంబంధించి సామర్లకోట మాజీ మున్సిపల్ చైర్మన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి, పెద్దాపురం మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ తదితర మాజీ కౌన్సిలర్లు కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, పెద్దాపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మల రామస్వామి బాబు ఆధ్వర్యంలో పిఠాపురంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలోకి చేరారు.ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

# విఆర్ఎల సమ్మెకు మద్దతు తెలిపిన మాల మహానాడు, సిపిఐ



**ఆలమూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 21:**రాష్ట్ర విఆర్ఎల సంఘం(జేఏసీ) పిలుపుమేరకు స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట మండల విఆర్ఏ లు తమ కనీస అవసరాలకు సంబంధించిన సమస్యలు తక్షణమే పరిష్కరించాలంటూ అరవ రోజు సోమవారం నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాల మహానాడు నేతలు దడాల చంద్రరావు, జల్లి వెంకట్రావు, సిపిఐ నేత కొండే రామకృష్ణ, తదితరులు వీఆర్ఎల సమ్మెకు సంఘీభావం తెలిపారు. అలాగే వీఆర్ఎల యొక్క న్యాయమైన సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల విఆర్ఎల సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు తాతపూడి ఇసాక్, భువనగిరి ఏసు, కార్యదర్శి కాంతేటి శివరామారావు లు మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా రూ.10,500 వేతనంతో ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్ లందరికీ తెలంగాణ తరహాలో పే స్కేల్ అమలు చేయాలని, నామినీగా పనిచేస్తున్న వారందరినీ రెగ్యులర్ వీఆర్ఎలుగా నియమించాలని, అర్హులైన వీఆర్ఏ లందరికీ 70 శాతం పదోన్నతి కల్పించాలని, మరణించిన వీఆర్ఏ కుటుంబాలలో ఒకరికి కారుణ్య నియామకం క్రింద ఉద్యోగం ఇవ్వాలని, పేద ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి న్యాయం చేయాలని కోరారు. వీఆర్ఎల శాంతియుత ధర్నాను ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తగు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో నిరవధిక సమ్మె చేయడం తప్పదని వారన్నారు. ఈ కార్యక్రమంలో సలహాదారు గూనపల్లి నాగేశ్వరరావు, కోశాధికారి కుందేటి శ్రీను, సభ్యులు సిద్దిల చంటిబాబు, తదితర విఆర్ఎలు పాల్గొన్నారు.

# విపిఆర్పి పై అవగాహన సదస్సు



**మండల మహిళా సమాఖ్య**

**ఆలమూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 21:**మండల కేంద్రంలోని స్త్రీ శక్తి (మండల మహిళా సమాఖ్య) భవనంలో గ్రామ సమృద్ధి స్థితిస్థాపక ప్రణాళిక(విపిఆర్పి) పై విఓఏ లకు, విఓబిలకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విచ్చేసిన ఎంపీడీవో ఏ.రాజు మాట్లాడుతూ 2026-27 స్వయం సహాయక సంఘాల, గ్రామ సంఘాల ప్రణాళికలలో గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను చేర్చుటకు మార్గదర్శకాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే ఈ శిక్షణ ద్వారా అక్టోబర్ 2న జరిగే జిపిడిపి ప్రణాళికలోకి చేర్చేందుకు విఓఏలు, విఓబిలు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఇందులో గ్రామ సంఘాలకు, సంఘ సభ్యులకు వ్యక్తిగతంగా కావలసిన అవసరాలను విపిఆర్పి ద్వారా నమోదు చేసి చేర్చవలసి ఉంటుందన్నారు. ఇందులో వయోజన విద్య, ఉపాధి, పింఛన్లు, రోడ్లు, డ్రైన్లు, తదితర అంశాలపై కులంకషంగా వివరాలు సేకరించి అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో అరుణకుమారి, ఏపిఎం ఎస్. సీతారామమ్మ, సిసిలు వి.ఎన్.సత్తిబాబు, కె.ఎల్.వి.ప్రసాద్, అకౌంటెంట్ కుమార్, ఎఫ్ పి అకౌంటెంట్ మల్లీశ్వరి, విఓఏలు విఓబీ లు పాల్గొన్నారు.

# జగ్గంపేట భాష్యం పాఠశాలలో అగ్నిప్రమాదాలపై అవగాహన



**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 21**: జగ్గంపేటలోని భాష్యం ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సోమవారం అగ్నిప్రమాదాల నివారణ, ప్రాణనష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు మరియు మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఫైర్‌మెన్ కమ్ రైటర్ డి. నానాజీ, లీడింగ్ ఫైర్ ఫైటర్ ఆర్.చంద్రశేఖర్ హాజరై విద్యార్థులు, ఉపాధ్యాయులకు అగ్నిప్రమాదాలపై కీలక సూచనలు చేశారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు కంగారు పడకుండా సంయమనంతో వ్యవహరించాలని కోరారు. ముఖ్యంగా పాఠశాలలు, నివాస గృహాలలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ లేదా గ్యాస్ లీకేజీల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అటువంటి సమయంలో అనుసరించాల్సిన ప్రాథమిక రక్షణ పద్ధతులను ఆయన వివరించారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది విద్యార్థుల సమక్షంలో లైవ్ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పచ్చదనం పరిమళం.. పిఠాపురం వనం ఆవిష్కారం





**కాకినాడ/పిఠాపురం, పెన్ పవర్ సెప్టెంబర్ 21:** పిఠాపురం పట్టణ, నియోజకవర్గ ప్రజలకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించే లక్ష్యంతో అభివృద్ధి చేసిన 'పీఠికాపుర వనం' నగర వనాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ--పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ సోమవారం ప్రారంభించారు. నగర వనంలో మొక్క నాటిన అనంతరం ప్రారంభ సూచికగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వ నగర వన్ యోజన పథకం కింద సుమారు రూ.1.83 కోట్లతో ఆరు ఎకరాల విస్తీర్ణంలో ఈ వనాన్ని అభివృద్ధి చేశారు.గతంలో డంపింగ్ యార్డుగా, అపరిశుభ్ర ప్రాంతంగా ఉన్న స్థలాన్ని నగర వనంగా తీర్చిదిద్దడం ద్వారా పిఠాపురానికి కొత్త హరిత సొబగులు వచ్చాయి. పట్టణానికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని నగర వనంలో నక్షత్ర వనం, శివ పంచాయతన వనాలను ప్రత్యేక ఆకర్షణలుగా ఏర్పాటు చేశారు. 27 నక్షత్రాలకు ప్రతీకగా వివిధ రకాల మొక్కలను వరుస క్రమంలో నాటగా, ప్రతి మొక్కకు శాస్త్రీయ నామం, స్థానికంగా వినియోగించే పేర్లతో బోర్డులు ఏర్పాటు చేశారు. శివుడు, వినాయకుడు, విష్ణువు, అమ్మవారు, సూర్యభగవానుడి స్వరూపాలకు ప్రతీకగా మొక్కలను ఏర్పాటు చేసిన శివ పంచాయతన వనం విశేషంగా ఆకట్టుకుంటోంది.70 సెంట్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన మియావకీ ఫారెస్ట్ ప్లాంటేషన్, బటర్‌ఫ్లై పార్కు, నగర వనం మధ్యలోని భారీ కొలనును ఉప ముఖ్యమంత్రి పరిశీలించారు. తక్కువ విస్తీర్ణంలో అధిక సంఖ్యలో మొక్కలను పెంచే మియావకీ విధానంలో చిట్టడవిని అభివృద్ధి చేశారు. భవిష్యత్తులో బాక్స్ క్రికెట్, ప్లే కోర్ట్స్ తదితర సౌకర్యాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి పిఠాపురానికి వచ్చే ఆధ్యాత్మిక సందర్శకులకు ఆహ్లాదాన్ని అందించేలా నగర వనాన్ని మరింత అభివృద్ధి చేయాలని పవన్ కళ్యాణ్ అధికారులకు సూచించారు. గతంలో డంపింగ్ యార్డుగా ఉన్న ప్రాంతం నుంచి నగర వనంగా రూపాంతరం చెందిన తీరును తెలిపే ఫోటో గ్యాలరీని కూడా ఆయన పరిశీలించారు. నగర వన అభివృద్ధికి కృషి చేసిన అటవీ శాఖ అధికారులను అభినందించారు. కేంద్ర ప్రభుత్వ నగర వన్ యోజన సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా నగర వనాల అభివృద్ధి కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో సుమారు రూ.36 కోట్లతో అభివృద్ధి చేసిన 18 నగర వనాలను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, పీసీసీఎఫ్ పి.వి. చలపతిరావు, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కళ్యాణం శివశ్రీనివాస్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, కౌడా చైర్మన్ తలాటం సత్య, రాష్ట్ర అటవీ శాఖ ఐటీ సలహాదారు పెన్నమరెడ్డి నాగబాబు, పడా పీడీ శివరాం ప్రసాద్, సీసీఎఫ్ జ్యోతి, కాకినాడ డీఎఫ్ఓ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ రైల్వే ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'స్వచ్ఛత హి సేవా




**.సామర్లకోట .. పెన్ పవర్ .. సెప్టెంబర్ 21..-..** సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 15 వరకు జరగనున్నాయి.దానిలో భాగంగా సోమవారం స్టేషన్ మేనేజర్ రమేష్ ఆధ్వర్యంలో సామర్లకోట జంక్షన్ రైల్వే స్టేషన్ లో యంత్రాలతో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ప్రభాకర్, హెల్త్ ఇన్స్పెక్టర్ కళ్యాణి, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ గిరి, కమర్షియల్ ఇన్స్పెక్టర్ మధు,శాఖీ సిబ్బంది, వివిధ డిపార్ట్మెంట్ల సిబ్బంది, మరియు కాంట్రాక్ట్ సిబ్బంది పాల్గొని స్టేషన్ ను శుభ్రం చేశారు.

# వైఎస్సార్‌సీపీకి వరుపుల సుబ్బారావు రాజీనామా..

- పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేనలో చేరిక



**పెన్ పవర్ ప్రతినిధి (పిఠాపురం) సెప్టెంబర్ , 21 :** ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు ఆ పార్టీకి రాజీనామా చేసి జనసేన పార్టీలో చేరారు. పిఠాపురం బైపాస్‌లోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను సోమవారం కలిసి జనసేనలో చేరారు. ఈ సందర్భంగా వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ.. తాను ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి ఏడు పర్యాయాలు పోటీ చేయగా, రెండుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించానన్నారు. తమ కుటుంబం నుంచి 12 పర్యాయాలు ప్రత్తిపాడు నియోజకవర్గంలో శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసినట్లు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) అధ్యక్షుడిగా కూడా కొంతకాలం పనిచేశానని చెప్పారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసి ఓటమి చెందానని తెలిపారు. కూటమి ప్రభుత్వం సాగునీరు, తాగునీరు వంటి మౌలిక అవసరాలపై దృష్టి సారిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న తీరు తనను ఆకట్టుకుందని, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వానికి అండగా ఉండాలనే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరినట్లు వెల్లడించారు. తనతో పాటు పలువురు నాయకులు, స్థానిక సంస్థల ప్రతినిధులు కూడా జనసేనలో చేరినట్లు వరుపుల సుబ్బారావు తెలిపారు. మండల కో-ఆప్షన్ సభ్యుడిగా పనిచేసిన రాంబాబు కృష్ణ, ధర్మవరం సొసైటీ అధ్యక్షుడిగా పనిచేసిన బాబీ, జగ్గంపేట నియోజకవర్గ జేఏసీ అధ్యక్షుడిగా పనిచేసిన న్యాయవాది జోకా శ్రీనివాసరావు తదితరులు జనసేనలో చేరిన వారిలో ఉన్నారు. రాబోయే స్థానిక సంస్థలతో పాటు ఇతర ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థుల విజయానికి తన వంతు సహకారం అందిస్తామని వరుపుల సుబ్బారావు తెలిపారు.

## పెంపుడు కుక్కలకు వ్యాక్సినేషన్ చర్యలు

వెటర్నరీ వైద్యాధికారి డాక్టర్ డి.వినోద్ కుమార్



**ఆలమూరు,పెన్ పవర్, సెప్టెంబర్ 21:**ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వివిధ వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున పెంపుడు కుక్కలకు వ్యాక్సినేషన్ వేసేందుకు చర్యలు చేపట్టినట్లు వెటర్నరీ వైద్యాధికారి డాక్టర్ డి వినోద్ కుమార్ అన్నారు.మండలంలోని జొన్నాడ పశు వైద్య కేంద్రంలో పెంపుడు కుక్కలకు ఆయన ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. యజమానులు తన పెంపుడు జంతువులను అప్రమత్తంగా చూసుకోవాలని ఆయన అన్నారు. లేనిపక్షంలో వీధి కుక్కలను కలవడం వలన వివిధ వ్యాధులు సోకుతాయన్నారు. అందుకే ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రభుత్వం అధ్వర్యంలో వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ నిర్వహించేలా అమలాపురంలో తొందరలోనే ఆపరేషన్ థియేటర్ అందుబాటులోకి రానుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది, యజమానులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 6 న రైతులు చలో విజయవాడ జయప్రదం చేయాలి.

- రైతు దినోత్సవంలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా.




**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, సెప్టెంబర్ 21:**వచ్చే నెల అక్టోబర్ 6 న చలో విజయవాడ కార్యక్రమాన్ని రైతులు జయప్రదం చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా పిలుపునిచ్చారు.సోమవారం ప్రత్తిపాడు మండలం లంపకలోవ, పెదశంకర్లపూడి గ్రామాల్లో భారతీయ కిసాన్ సంఘ్ కాకినాడ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రైతు దినోత్సవం,బలరాముని జయంతి ఘనంగా నిర్వహించారు.ముందుగా సంఘ్ జెండా జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా ఆవిష్కరించగా జిల్లా ఉపాధ్యక్షుడు నీలగిరి చిట్టిబాబు,కోశాధికారి కంపరపు నాగేశ్వరరావు బలరాముని చిత్రపటానికి జ్యోతి వెలిగించి పూజలు చేశారు.అనంతరం గ్రామ కార్యదర్శి బాదం రాజబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాజా మాట్లాడుతూ అక్టోబరు 6 చలో విజయవాడ విజయవంతం చేయాలి అని పిలుపునిచ్చారు.రైతుల శక్తి ప్రదర్శనలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొని తమ సంఘీభావం తెలియజేయాలని కోరారు.జిల్లా ఉపాధ్యక్షుడు నీలగిరి చిట్టిబాబు మాట్లాడుతూ కిసాన్ సంఘ్ 1979 లో రాజస్థాన్ రాష్ట్రంలో కోట అనే పట్టణంలో మార్చి 4 న సర్ దత్తోపంత్ ఠేంగ్డే జీ వారు ప్రారంభం చేశారన్నారు.కోశాధికారి కంపరపు నాగేశ్వరరావు మాట్లాడుతూ పోలవరం ,పుష్కర,ఏలేరు ఎడమ కాలువలు ప్రక్క ప్రక్కనే ప్రవహిస్తున్నప్పటికీ ప్రత్తిపాడు మండల పరిధిలోని పొలాలకు ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయారు.ఎల్ నినో ప్రభావంతో జిల్లాలో చాలా చోట్ల పంటలు వేయలేదని వేసిన చోట ఎండిపోయో పరిస్థితి నెలకొందన్నారు. పోలవరం కానీ,పుష్కర కాలువకు కానీ మండలంలో ధర్మవరం వద్ద ఒకచోట, లంపకలవ వద్ద ఒకచోట లిఫ్ట్ ఏర్పాటు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో శెట్టి సుబ్బారావు,బాబ్జి,చుక్కపల్లి భూరయ్య, జువ్విన తిరుపతిరావు, కర్రి ధర్మరాజు,రాసంశెట్టి సురేష్,పలువురు రైతులు, మహిళలు పాల్గొన్నారు.

### చెముడులంకలో రూ. 54.70 లక్షలతో అభివృద్ధికి భూమిపూజ




**ఆలమూరు,పెన్ పవర్, సెప్టెంబర్ 21:**మండలంలోని చెముడులంకలో రూ.54.70 లక్షలతో అభివృద్ధి పనులకు సొసైటీ చైర్మన్ నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి వెంకటరత్నం, కూటమి నాయకులతో కలిసి సోమవారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా రూ. 50 లక్షలతో పైప్ లైన్ నిర్మాణానికి, సచివాలయం 2 కి రూ.2 లక్షలతో గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి, స్థానిక శ్రీనివాస్ నగర్ లో రూ. 2.70 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన కార్యక్రమం చేపట్టి పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఇందులో మరి ముఖ్యంగా సుమారు 25 ఏళ్లుగా దీర్ఘకాలికంగా వివిధ కారణాలతో అభివృద్ధికి నోచుకోకుండా మిగిలిపోయిన శ్రీనివాస్ నగర్ లో సిసి రోడ్ నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పెద్దపీట వేస్తు అడిగిందే తడవుగా నిధులు మంజూరు చేయిస్తూ ఎంతో సహకరిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు నాగిరెడ్డి సత్యానందం, కొత్తపల్లి రాంబాబు, శిరంగుల సతీష్, గుండుమల్ల రాంబాబు, అడబాల వీర్రాజు, తమ్మన ఏసు, పేరపు చిన్న, తమ్మన గోపాలకృష్ణ, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా గురజాడ జయంతి



**కాకినాడ, పెన్ పవర్ ,సెప్టెంబర్ 21:** తెలుగు సాహితీ దిగ్గజం, మహాకవి, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు జయంతి వేడుకలను సోమవారం కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్,గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గురజాడ అప్పారావు తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు కృషి చేశారని అన్నారు. ప్రజలకు సులభంగా అర్థమయ్యే వాడుక భాషలో రచనలు చేస్తూ తెలుగు సాహిత్యానికి విశేష సేవలందించారని పేర్కొన్నారు. 'కన్యాశుల్కం' వంటి రచనల ద్వారా సమాజంలోని మూఢాచారాలను ప్రశ్నించి సామాజిక చైతన్యానికి బాటలు వేశారని కొనియాడారు.కవిశేఖర, అభ్యుదయ కవితా పితామహుడు, నవయుగ వైతాళికుడు వంటి బిరుదులతో గౌరవించబడిన గురజాడ సాహితీ సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం.వి.వి.సత్యనారాయణ మూర్తి,జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది, పోలీసు అధికారులు,సిబ్బంది పాల్గొని మహాకవికి ఘనంగా నివాళులర్పించారు.

### లింగంపర్తిలో ఘనంగా శ్రీ వరసిద్ధి వినాయకుని మహోత్సవాలు.





**3 వేల మంది భక్తులకు మహా అన్నదానం.**

**ఏలేశ్వరం, పెన్ పవర్, సెప్టెంబర్ 21**: మండల పరిధి లింగంపర్తి గ్రామం గానుగ చెట్టు వీధిలో శ్రీ వరసిద్ధి వినాయక నవరాత్రి మహోత్సవ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ముందుగా శ్రీ వరసిద్ధి వినాయకుని కి ప్రత్యేక పూజలు, దీపారాధనలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో హారతులు ఇచ్చారు. అనంతరం ఉదయం 11 గంటల నుంచి మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా 3 వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. మహిళా భక్తులు అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు తమ సేవలు అందించారు.

## వాడపల్లి ఆలయ విస్తరణకు భూసేకరణ కసరత్తు

గ్రామస్తుల అభిప్రాయాలకు 15 రోజుల వ్యవధి

భవిష్యత్ భక్తుల రద్దీకి అనుగుణంగా మౌలిక వసతుల విస్తరణపై దృష్టి





**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 21** :కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానానికి భవిష్యత్తులో పెరుగనున్న భక్తుల రాకపోకలు, వారి సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని ఆలయ పరిసరాల్లో మౌలిక వసతుల విస్తరణకు సంబంధించి భూసేకరణ ప్రక్రియపై అధికార యంత్రాంగం కసరత్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా ఆలయ కార్యాలయంలో సోమవారం త్రీమెన్ కమిటీ సమావేశం నిర్వహించారు.కొత్తపేట ఆర్డీవో జి.వి.వి. సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆలయం చుట్టూ ఉన్న మాడవీధులను ఆనుకుని ఉన్న ప్రైవేట్ భూములు, ఇళ్ల స్థలాలను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా భూసేకరణ ద్వారా కొనుగోలు చేసే అంశంపై విస్తృతంగా చర్చించారు. ఆలయ విస్తరణతో పాటు భక్తులకు అవసరమైన రహదారులు, రాకపోకలు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి భూమి సమీకరణ అవసరంపై అధికారులు వివరించారు. అయితే భూసేకరణ ప్రతిపాదనలపై స్థానిక గ్రామస్తులు తమ అభిప్రాయాలను వెల్లడిస్తూ నిర్ణయం తీసుకునేందుకు 15 రోజుల సమయం ఇవ్వాలని కమిటీని కోరారు. గ్రామస్తుల అభ్యర్థనను అధికారులు సానుకూలంగా పరిగణించి, వారి అభిప్రాయాలను స్వీకరించిన అనంతరం తదుపరి సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దీంతో భూసేకరణ అంశం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.సమావేశంలో దేవాదాయశాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ వి. త్రినాథరావు, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ, ఎంఆర్వో ఆర్. శ్రీరామచంద్రమూర్తి, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావుతో పాటు రెవెన్యూ, పోలీస్, పంచాయతీ, దేవాదాయశాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు. గ్రామస్తుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తదుపరి చర్యలను చేపట్టేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు.

### ఘనంగా గురజాడ అప్పారావు జయంతి వేడుకలు




**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 21:** జగ్గంపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చెన్నారావు ఆధ్వర్యంలో తెలుగు శాఖాధిపతి డాక్టర్ డి.సత్యలత ప్రముఖ తెలుగు కవి, రచయిత, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు జయంతి ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చెన్నారావు మాట్లాడుతూ గురజాడ అప్పారావు తెలుగు సాహిత్యానికి అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్ అనే సందేశం ద్వారా దేశభక్తి, మానవతా విలువలను ప్రజల్లో పెంపొందించారని తెలిపారు. ముందుగా గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సిహెచ్ బాలరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# వీఆర్ఏల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా





## మంత్రి సుభాష్‌ను కలిసి వినతిపత్రం అందజేసిన గ్రామ రెవెన్యూ సహాయకులు

**కాజులూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 21:** ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మె చేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏలు) సోమవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కలిసి తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. వీఆర్ఏల సమస్య రాష్ట్రవ్యాప్తంగా ఉందని,వారి డిమాండ్లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి సుభాష్ హామీ ఇచ్చారు.

**సమ్మె ఆరో రోజుకు..**

కాజులూరు మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్ఏలు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం ఆరో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం మండల అధ్యక్షుడు వినకోటి సత్యనారాయణ మాట్లాడుతూ వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేసి ఆర్థిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో వీఆర్ఏలకు అమలు చేస్తున్న విధంగా తమకు కూడా పే స్కేల్ సదుపాయం కల్పించాలని కోరారు.

**అర్హులకు వీఆర్వో పోస్టులు కల్పించాలి**

నామినీలుగా పనిచేస్తున్న వారితో పాటు ఆన్‌లైన్ సెటిల్‌మెంట్ వీఆర్ఏలుగా విధులు నిర్వహిస్తున్న అర్హులను గుర్తించి తగిన విధంగా నియామకాలు చేపట్టాలని వీఆర్ఏలు కోరారు. అర్హత కలిగిన వీఆర్ఏల్లో 70 శాతం మందికి వీఆర్వో పోస్టులు కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామస్థాయిలో రెవెన్యూ పరిపాలనలో వీఆర్ఏలు కీలకమైన విధులు నిర్వహిస్తున్నారని, ప్రతి గ్రామంలో ప్రభుత్వ కార్యక్రమాల అమలులో వారి పాత్ర ముఖ్యమైనదని తెలిపారు.

**మృతిచెందిన వీఆర్ఏల కుటుంబాలకు ఉద్యోగం ఇవ్వాలి**

విధి నిర్వహణలో మృతిచెందిన వీఆర్ఏల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సత్యనారాయణ కోరారు. ఆయా కుటుంబాల్లో అర్హత ఉన్న ఒకరికి వయసుతో సంబంధం లేకుండా ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వీఆర్ఏ సంఘం నాయకులతో తక్షణమే చర్చలు జరిపి పరిష్కారం చూపాలని కోరారు.

**ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి**

గ్రామస్థాయిలో రెవెన్యూ పరిపాలనకు వీఆర్ఏలు కీలకంగా పనిచేస్తున్నప్పటికీ, ఏళ్ల తరబడి తమ సమస్యలు పరిష్కారం కాకపోవడం బాధాకరమని వీఆర్ఏలు పేర్కొన్నారు. పే స్కేల్ అమలు, అర్హులకు వీఆర్వో పోస్టులు, మృతిచెందిన వీఆర్ఏల కుటుంబాలకు ఉద్యోగం తదితర డిమాండ్లను ప్రభుత్వం పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.నిరసన కార్యక్రమంలో వీఆర్ఏలు వాసంశెట్టి సుబ్బారావు,తాతపూడి రాజు,ఎం. వెంకటరమణ,లంక రవికుమార్,ప్రసాద్, విష్ణు,భవాని,సాయిలక్ష్మి,వీర్రాజు, చంద్రశేఖర్,పద్మ, వెంకటేశ్వరరావు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గురజాడ అప్పారావు జయంతి వేడుకలు.



**కిర్లంపూడి, పెన్ పవర్, సెప్టెంబర్,21:** కాకినాడ జిల్లా మండల కేంద్రమైన కిర్లంపూడి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో కీర్తిశేషులు గురజాడ వెంకట అప్పారావు జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి, బాయిశెట్టి హరికృష్ణ, గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ, ఎం వి సుబ్బారావు, మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి ఎన్.ఎం కే.జీ ప్రసాద్, మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు శరణం రాజబాబు, మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## న్యాయమైన డిమాండ్లను తక్షణమే ప్రభుత్వం అమలు చేయాలి.

**6 వ రోజుకు చేరుకున్న ప్రత్తిపాడులో వీఆర్ఏల నిరవధిక సమ్మె.**

**తక్షణమే న్యాయమైన కోర్కెలను అమలు చేయాలని వీఆర్ఏల డిమాండ్.**




**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, సెప్టెంబర్,19:** తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ప్రత్తిపాడు మండలం వి.ఆర్.ఏల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్లను తక్షణమే అమలు చేయాలని వీఆర్ఏలు చేస్తున్న నిరవధిక సమ్మె సోమవారం 6 వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ వీఆర్ఏల అందరికీ తెలంగాణ తరహాలో పే స్కేలు తక్షణమే అమలు చేయాలని, నామినీలుగా పనిచేస్తున్న వీఆర్ఏలు అందర్నీ వన్ టైం సెటిల్మెంట్ విఆర్ఎల్ గా నియమించాలని,అర్హులైన వీఆర్ఏలకు 70 శాతం పదోన్నతి కల్పించాలని, మరణించిన విఆర్ఏల కుటుంబాలలో వయసుతో సంబంధం లేకుండా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకపోతే సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ కొమరగిరి కృష్ణ, కార్యదర్శి,మానూరి సత్తిబాబు, కోశాధికారి, మురా గంగరాజు, వైస్ ప్రెసిడెంట్ ఖండవిల్లి బాలరాజు, కార్యవర్గ సభ్యులు దాసు,బూరా సత్తిబాబు,కుళ్ల రామకృష్ణ, బూరా చినబాబు, చినప్పారావు,ఇండుగబిల్లి నాని,అనిల్,కుమార్ మండలంలోని పలు వీఆర్ఏలు పాల్గొన్నారు.

## రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దీటుగా ఎదుర్కోవడానికి సంసిద్ధంగా ఉండాలి.

**-ప్రత్తిపాడు వైఎస్ఆర్‌సీపీ శ్రేణుల భేటీలో ముద్రగడ గిరిబాబు.**



**కిర్లంపూడి, పెన్ పవర్, సెప్టెంబర్ 21:** ప్రత్తిపాడు నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే కాకుండా , రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని దీటుగా ఎదుర్కోవడానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంసిద్ధంగా ఉండాలని ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు కిర్లంపూడిలోని ముద్రగడ నివాసానికి ప్రతిపాడు నియోజకవర్గంలోని పలు గ్రామాల నుండి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ముద్రగడ అభిమానులు భారీగా తరలివచ్చి ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీఇన్‌ఛార్జ్ ముద్రగడ గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి, నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ పార్టీని మరింత బలోపేతం చేయడమే కాకుండా, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ ను తాకిన జనసేన వర్గ పోరు

- అనివార్య కారణాలతో రద్దయిన కొత్తపల్లి మండల పర్యటన
- సోమవారం 2 ప్రారంభోత్సవాలకే పరిమితమైన పవన్ కళ్యాణ్
- పవన్ పర్యటనలో స్థానిక నాయకులకు దక్కని చోటు



**పెన్ పవర్ ప్రతినిధి, కాకినాడ(గొల్లప్రోలు,) సెప్టెంబర్, 21** కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలంలో జనసేన నాయకుల బహిర్గత పోరు జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తాకిందా అంటే అవుననే సమాధానం వినిపిస్తుంది. మొదటగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం పవన్ కళ్యాణ్ సోమవారం పిఠాపురం మండలంతో పాటు కొత్తపల్లి మండలంలో కూడా పర్యటించాల్సి ఉంది. కానీ చివరి నిమిషంలో షెడ్యూల్లో మార్పులు చోటుచేసుకుని కొత్తపల్లి మండల పర్యటన రద్దయింది. ఇది కేవలం స్వల్ప మార్పులే అని అధికారులు ప్రకటించినా కొత్తపల్లి మండల పర్యటన రద్దు వెనక పెద్ద తతంగమే నడిచింది అన్న వార్తలు వినిపిస్తున్నాయి. పవన్ పర్యటనకు ఒక రోజు ముందు అనగా ఆదివారం కొత్తపల్లి మండలానికి చెందిన జనసేన పార్టీలో వివిధ పదవుల్లో ఉన్న జనసేన నాయకులు, కార్యకర్తలు అంతా ఏకమై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండలాధ్యక్షుడు పై పలు ఆరోపణలు గుప్పించారు. మండల అధ్యక్షుడు ఒంటెద్దు పోకడలతో వెళుతున్నారని, పార్టీ కోసం పనిచేసిన అసలైన జనసైనికులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విషయం తెలుసుకున్న పవన్ కళ్యాణ్ చివరి నిమిషంలో కొత్తపల్లి మండల పర్యటన రద్దు చేసుకున్నట్లు తెలుస్తుంది. మొదటిరోజు ఎఫ్ కె పాలెం చెరువు, పట్టణ పరిధిలోని పీఠికాపురం వనం ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం బస ఏర్పాటు చేసిన ఆర్ అండ్ బి అతిథి గృహం లోకి వెళ్లారు. పవన్ కళ్యాణ్ ను కలిసి తమ సమస్యలు చెప్పుకునేందుకు చిన్నపిల్లలతో వచ్చిన వారు, వృద్ధులు, మహిళలు పవన్ కలిసేందుకు గంటల తరబడి నిరీక్షించిన ఫలితం దక్కలేదు.

ఎఫ్ కె పాలెం లో జ్యోతి అనే అందురాలైన మహిళను పవన్ కలవకుండా వెళ్లిపోవడం, పోలీసులు అడ్డుకోవడం చర్చనీయాంశంగా మారింది. పీటికాపురం వనం ప్రారంభోత్సవం వద్ద స్థానిక జనసేన నాయకులు ను పోలీసులు అడ్డుకున్నారు. జనసేన నాయకులను అడ్డుకుంటే ఎలా అంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పవన్ ప్రయాణించిన మార్గమధ్యలో అధిక సంఖ్యలో ప్రజలు ఎవరు రాకపోవడం కొత్త చర్చకు దారితీసింది. రెండో రోజు కొత్తపల్లి మండల పర్యటన ఉంటుందని అధికారులు ప్రకటించినా... అవేమీ ఉండవని, కేవలం సభాస్థలికే పరిమితమై అక్కడే శిలాఫలకాలకు ప్రారంభోత్సవాలు చేస్తారన్న వాదనలు వినిపిస్తున్నాయి. పవన్ పర్యటనలో పిఠాపురం నాయకులు కార్యకర్తలు కంటే ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారే అధికంగా ఉండడంతో ఇక్కడి జనసేన నాయకులు, కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరిన చదలవాడ బాబి.

**-పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్.**





**కిర్లంపూడి, పెన్ పవర్, సెప్టెంబర్, 21:** కిర్లంపూడి సొసైటీ మాజీ అధ్యక్షుడు చదలవాడ బాబి సోమవారం పిఠాపురంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. జనసేన పార్టీలో చేరిన చదలవాడ బాబీకి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. బాబితో పాటు రాజుపాలెం గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది జోకా విజయ్ కుమార్ (శ్రీను) పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. పార్టీలోకి చేరిన జోకా శ్రీనుకు,పవన్ కళ్యాణ్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చదలవాడ బాబీ మాట్లాడుతూ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధిని చూడడమే కాకుండా, ఆయన ఆశయాలకు ఆకర్షితులై జనసేన పార్టీలోకి చేరడం జరిగిందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి అంకుటిత దీక్షతో పని చేస్తామని బాబితోపాటు శ్రీను తెలిపారు. ఈ కార్యక్రమంలో చిక్కాల కల్కిభగవాన్, యల్లపు శివ తదితరులు ఉన్నారు.

## ధర్మవరం వైయస్సార్ నగర్ గణపతి నవరాత్రి ఉత్సవాల్లో మురళీకృష్ణంరాజు.

**-అన్నదాన కార్యక్రమానికి 5,000 రూపాయలు విరాళం అందజేత.**



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, సెప్టెంబర్ 21:** ప్రత్తిపాడు మండలం, ధర్మవరం వైయస్సార్ నగర్ లో నిర్వహించిన వినాయక చవితి వేడుకలను పురస్కరించుకుని కమిటీ సభ్యులు ఆహ్వానం మేరకు గణపతి నవరాత్రి ఉత్సవాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నరసాపురం పార్లమెంటు నియోజకవర్గం పరిశీలకులు, ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని స్వామి వారిని వేడుకోవడమే కాకుండా,స్వామి వారి అన్నదాన కార్యక్రమానికి 5000 రూపాయలు విరాళం కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోలా తాతబాబు,జువ్వల దొరబాబు ,దాడి పుత్రయ్య ,పులి సత్తిబాబు,జువ్వల శివ ,కోన తాతారావు,ఆవాల రమణ,చిట్టూరి ఏసుబాబు,ఆవాల బాబ్జి ,బూదిన సత్తిబాబు,కడారి వీరన్న,కోన శ్రీను,జువ్వల చందు,కమిటీ సభ్యులు, పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు

## గోల్డ్ మెడల్ పోరులో భారత్ vs శ్రీలంక: ఆసియా గేమ్స్ ఫైనల్ మ్యాచ్ ఎప్పుడు, ఎక్కడ చూడాలంటే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా గేమ్స్ 2026 మహిళల క్రికెట్ విభాగంలో అత్యంత కీలక ఘట్టం ఆసన్నమైంది. పసిడి పతకం కోసం డిఫెండింగ్ ఛాంపియన్ భారత మహిళల క్రికెట్ జట్టు శ్రీలంక మహిళల జట్టు (మంగళవారం, సెప్టెంబర్ 22) హోరాహోరీగా తలపడనున్నాయి. జపాన్‌లోని నిషిన్‌లో ఉన్న కోరోగి స్పోర్ట్స్ పార్క్ వేదికగా ఈ చారిత్రాత్మక ఫైనల్ పోరు జరగనుంది.

**అద్భుత ప్రదర్శనతో ఫైనల్‌కు భారత్, లంక:**

భారత్ ఘన విజయం: బంగ్లాదేశ్‌తో జరిగిన సెమీఫైనల్‌లో ఓపెనర్ షెఫాలీ వర్మ కేవలం 49 బంతుల్లోనే అజేయంగా 100 పరుగులు చేసి రికార్డు సెంచరీతో విరుచుకుపడింది. దీంతో భారత్ 20 ఓవర్లలో 195/4 పరుగులు చేయగా.. బంగ్లాదేశ్‌ను 81 పరుగులకే ఆలౌట్ చేసి 114 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. ఇదే మ్యాచ్‌లో స్మృతి మంధాన మహిళల టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్‌గా ప్రపంచ రికార్డు సృష్టించింది.

శ్రీలంక ఊచకోత: పాకిస్థాన్‌తో జరిగిన మరో సెమీఫైనల్‌లో శ్రీలంక కెప్టెన్ చమరి అతపత్తు (50 బంతుల్లో 83 నాటౌట్) చెలరేగడంతో 178 పరుగుల భారీ లక్ష్యాన్ని కేవలం 2 వికెట్లు కోల్పోయి ఛేజ్ చేసింది.

**మరోసారి ఆసియా కప్ రిపీట్:**

ఈనెల ఆరంభంలో దుబాయ్‌లో జరిగిన మహిళల ఆసియా కప్ 2026 ఫైనల్‌లోనూ భారత్ వర్సెస్ శ్రీలంక జట్లే పోటీపడ్డాయి. ఆ మ్యాచ్‌లో భారత్ ఘన విజయం సాధించి ట్రోఫీ గెలుచుకుంది. ఇప్పుడు ఆసియా గేమ్స్ ఫైనల్లోనూ ఈ రెండు జట్లు తలపడతుండటం విశేషం. 2022 హ్యాంగ్‌జౌ ఆసియా గేమ్స్‌లో స్వర్ణం గెలుచుకున్న టీమిండియా, ఈసారి కూడా టైటిల్‌ను నిలబెట్టుకోవాలని పట్టుదలతో ఉంది. శ్రీలంక జట్టు ఆసియా గేమ్స్‌లో తమ తొలి క్రికెట్ గోల్డ్ మెడల్ సాధించాలని భావిస్తోంది.

**హెడ్ టు హెడ్ రికార్డు:**

మొత్తం మ్యాచ్‌లు: 32
భారత్ విజయం: 26
శ్రీలంక విజయం: 5
ఫలితం లేనిది: 1

**కీలక ఆటగాళ్లు:**

భారత జట్టు తరఫున ఫామ్‌లో ఉన్న షెఫాలీ వర్మ, స్మృతి మంధాన, కెప్టెన్ హర్మాన్‌ప్రీత్ కౌర్, ఆల్ రౌండర్ దీప్తి శర్మ మ్యాచ్ విన్నర్లుగా మారనుండగా.. శ్రీలంక జట్టు పూర్తిగా వారి స్టార్ కెప్టెన్ చమరి అతపత్తుపై ఆధారపడి ఉంది.

**మహిళల ఆసియా గేమ్స్ 2026 ఫైనల్ వివరాలు:**

తేదీ: సెప్టెంబర్ 22, 2026 (మంగళవారం)
సమయం: ఉదయం 10:30 గంటలకు (IST) (జపాన్ కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2:00 గంటలకు)
వేదిక: కోరోగీ స్పోర్ట్స్ పార్క్, నిషిన్, జపాన్
టీవీ ప్రసారం: భారత్‌లో Sony Sports Network ఛానెళ్లలో ప్రత్యక్ష ప్రసారం కానుంది.
లైవ్ స్ట్రీమింగ్: SonyLIV యాప్, వెబ్‌సైట్‌లో లైవ్ చూడవచ్చు.

# CSKలో సంచలన మార్పు.. జహీర్ ఖాన్‌కు హెడ్ కోచ్ బాధ్యతలు!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు ఐదుసార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ సంచలన నిర్ణయం తీసుకుంది. తమ కొత్త హెడ్ కోచ్‌గా భారత మాజీ దిగ్గజ పేసర్ జహీర్ ఖాన్ ను నియమించింది. గత 18 ఏళ్లుగా సీఎస్కేతో సుదీర్ఘ అనుబంధం ఉన్న స్టీఫెన్ ఫ్లెమింగ్ ఆ పదవి నుంచి తప్పుకోవడంతో జహీర్ ఖాన్‌కు ఈ బాధ్యతలు అప్పగించారు.




**లెఫ్ట్ ఆర్మ్ టేకింగ్ ఓవర్.. సీఎస్కే గ్రాండ్ వెల్కమ్:**

ఇంగ్లాండ్ కోచ్‌గా ఫ్లెమింగ్: 18 ఏళ్ల పాటు సీఎస్కే కోచింగ్ సెటప్‌లో కీలక పాత్ర పోషించి ఎన్నో ట్రోఫీలను అందించిన స్టీఫెన్ ఫ్లెమింగ్, జులైలో ఇంగ్లాండ్ పురుషుల టెస్టు జట్టు హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సీఎస్కేతో తన బంధాన్ని ముగించడంతో ఫ్రాంచైజీ జహీర్‌ను ఎంచుకుంది. 2017లో ఐపీఎల్ నుంచి ఆటగాడిగా రిటైర్ అయిన తర్వాత జహీర్ ఖాన్ వివిధ ఫ్రాంచైజీలలో కీలక బాధ్యతలు నిర్వర్తించాడు.

**మెంటార్‌గా జహీర్ అనుభవం:**

ముంబై ఇండియన్స్ : ముంబై ఇండియన్స్‌కు డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ ఆపరేషన్స్ గా, ఆ తర్వాత హెడ్ ఆఫ్ గ్లోబల్ డెవలప్‌మెంట్‌గా సేవలందించాడు.

లక్నో సూపర్ జెయింట్స్ : ఐపీఎల్ 2025 సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ మెంటార్‌గా వ్యవహరించాడు.

ఐపీఎల్ కెరీర్: ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (RCB), ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున 100 మ్యాచ్‌లు ఆడిన జహీర్ 27.27 సగటుతో 102 వికెట్లు పడగొట్టాడు.

అంతర్జాతీయ రికార్డు: టీమిండియా తరఫున మూడు ఫార్మాట్లలో కలిపి ఏకంగా 610 అంతర్జాతీయ వికెట్లు సాధించాడు.

ఐదుసార్లు ఐపీఎల్ ట్రోఫీని గెలుచుకున్న చెన్నై సూపర్ కింగ్స్, 2027 సీజన్ కోసం జహీర్ ఖాన్ మార్గదర్శకత్వంలో ఒక కొత్త శకానికి శ్రీకారం చుట్టింది. జహీర్ సుదీర్ఘ క్రికెటింగ్ విజన్ సీఎస్కే యువ బౌలర్లకు, జట్టు విజయాలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అభిమానులు ఆశిస్తున్నారు.

## 700 గ్రాముల బరువుతో ఫైనల్ ఛాన్స్ మిస్: రింగ్‌లోనే ఏడ్చేసిన సుచిక.. కాంస్యంతో సరి!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా గేమ్స్ 2026 లో భారత మిక్స్డ్ మార్షల్ ఆర్ట్స్ ఫైటర్ సుచిక తరియాల్ ( చారిత్రాత్మక విజయం సాధించినప్పటికీ, తీవ్ర గుండెకోతకు గురైంది. మహిళల ట్రెడిషనల్ 60 కేజీల సెమీఫైనల్‌లో అద్భుత ప్రదర్శన చేసినా, విచిత్రమైన వెయిట్ రూల్ కారణంగా ఆమె రజతం/పసిడి పోరుకు దూరమై కాంస్య పతకంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ ఫలితంతో తీవ్ర నిరాశ చెందిన సుచిక మ్యాచ్ ముగియగానే మ్యాట్‌పైనే ఒక్కసారిగా ఏడ్చేసింది.

**1000 డాలర్లు చెల్లించి ఛాలెంజ్ చేసినా:**

సింగపూర్‌కు చెందిన హ్యూ హూన్ టియో తో జరిగిన ఈ సెమీఫైనల్ పోరు అత్యంత ఉత్కంఠభరితంగా కొనసాగింది.

రెగ్యులర్ రౌండ్లు టై: ఇద్దరు ఫైటర్లు చెరో రౌండ్‌లో ఆధిపత్యం చెలాయించడంతో ఓవర్ టైమ్‌కు మ్యాచ్ వెళ్లింది. ఓవర్ టైమ్ తర్వాత కూడా విజేత ఎవరో స్పష్టంగా తేలకపోవడంతో తొలిగా టియోను విజేతగా ప్రకటించారు.

భారత్ రివ్యూ ఛాలెంజ్: రెఫరీ నిర్ణయాన్ని నిరసిస్తూ భారత మేనేజ్‌మెంట్ వి1,000 డాలర్లు (సుమారు ?84,000) ఆర్బిట్రేషన్ ఫీజు చెల్లించి సవాలు చేసింది. ఆరుగురు న్యాయనిర్ణేతలు రీ-రివ్యూ చేసి మ్యాచ్‌ను డ్రా (Draw)గా ప్రకటించారు.

**విజేతను తేల్చిన 700 గ్రాముల బరువు:**

ఇంటర్నేషనల్ మిక్స్డ్ మార్షల్ ఆర్ట్స్ ఫెడరేషన్ నిబంధనల ప్రకారం మ్యాచ్ రీ-రివ్యూ తర్వాత కూడా టై అయితే ఉదయం జరిగిన వెయిట్-ఇన్ ఆధారంగా తక్కువ బరువు ఉన్న ఫైటర్‌ను విజేతగా ప్రకటిస్తారు.

తక్కువ బరువుతో టియోకు లబ్ధి: సుచిక ఉదయం 59.2 కేజీల బరువు ఉండగా, సింగపూర్ ప్లేయర్ టియో 58.5 కేజీల బరువు ఉంది.

700 గ్రాముల తేడాతో: కేవలం 700 గ్రాములు తక్కువ బరువు ఉన్నందున టియోను విజేతగా ప్రకటించి ఫైనల్‌కు పంపారు. దీంతో సుచిక కాంస్య పతకానికి పరిమితమైంది.

**ఇది అన్యాయం.. కానీ దేశం కోసం గర్వపడుతున్నా:**

తీర్పు వినగానే తీవ్ర భావోద్వేగానికి గురైన సుచిక, నేను ఈ మ్యాచ్ గెలిచానని భావించాను.. ఫలితాన్ని అంగీకరించలేకపోతున్నాను, ఇది నాకు అన్యాయంగా అనిపించింది. కానీ దేశం కోసం కాంస్యం సాధించినందుకు సంతోషంగా ఉందని ఆవేదన వ్యక్తం చేసింది. హర్యానాలోని రోహ్‌తక్ జిల్లా కిలోయ్ గ్రామానికి చెందిన సుచిక, చిన్నతనంలో రోడ్డుపై వేధింపులను ఎదుర్కొని స్వీయ రక్షణ కోసం కాంబ్యాట్ స్పోర్ట్స్‌లోకి వచ్చి నేడు ఆసియా గేమ్స్ పీఠం ఎక్కింది.

**చరిత్ర సృష్టించిన సుచిక:**


ఓటమి బాధ పక్కనబెడితే, ఆసియా గేమ్స్ చరిత్రలో మిక్స్డ్ మార్షల్ ఆర్ట్స్ (వీహీూ) విభాగంలో భారత్‌కు తొలి పతకం అందించిన అథ్లెట్‌గా సుచిక తరియాల్ చరిత్ర పుటలకెక్కింది. సుచిక సాధించిన ఈ కాంస్యంతో ఆసియా గేమ్స్ 2026లో భారత పతకాల సంఖ్య 6కు (4 వెండి, 2 కాంస్యం) చేరింది.

# దసరాకు వస్తే హిట్టే.. మరి ఈసారి?

టాలీవుడ్ లో కొంతమంది హీరోలకు కొన్ని సీజన్లతో స్పెషల్ రిలేషన్ ఉంటుంది. సీనియర్ హీరో విక్టరీ వెంకటేష్ కు సంక్రాంతి అలాంటి సీజన్ అయితే.. దసరా కూడా కలిసొచ్చిన సందర్భాలు ఉన్నాయి. దాదాపు 40 ఏళ్ల సినీ జర్నీలో ఆయన దసరా సమయంలో చాలా తక్కువ సినిమాలతోనే ప్రేక్షకుల ముందుకు వచ్చారు. కానీ వచ్చిన ప్రతిసారీ బాక్సాఫీస్ దగ్గర తన మార్క్ చూపించారు. ఇప్పుడు మరోసారి దసరా సీజన్ లో వెంకీ సినిమా రాబోతుండటంతో ఆ సెంటిమెంట్ పై చర్చ మొదలైంది. వెంకటేష్ ఇప్పటివరకు దసరా సీజన్ ను టార్గెట్ చేస్తూ నాలుగు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చినట్లు తెలుస్తోంది. వాటిలో ఎక్కువ సినిమాలు మంచి విజయాలను అందుకున్నాయి. దీంతో దసరా సీజన్ కూడా వెంకీకి కలిసొచ్చే టైమ్ గా మారింది. 2000లో వచ్చిన జయం మనదేరా అందుకు బెస్ట్ ఎగ్జాంపుల్. అక్టోబర్ లో దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆ సినిమా భారీ విజయాన్ని అందుకుంది. వెంకటేష్ కెరీర్ లో గుర్తుండిపోయే చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. యాక్షన్, ఎమోషన్ తో సాగిన ఆ సినిమా అప్పట్లో ప్రేక్షకులను థియేటర్లకు బాగానే రప్పించింది. ఆ తర్వాత 2007లో తులసితో మరోసారి దసరా బరిలోకి దిగారు వెంకటేష్. బోయపాటి శ్రీను







దర్శకత్వంలో తెరకెక్కిన ఆ సినిమా యాక్షన్ తో పాటు కుటుంబ ప్రేక్షకులకు నచ్చే అంశాలతో వచ్చింది. దసరా సెలవులను క్యాష్ చేసుకున్న ఆ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. 2008లో చింతకాయల రవితో మరోసారి ఇదే సీజన్ లో సందడి చేశారు. ఆ సినిమా గత రెండు చిత్రాల రేంజ్ లో విజయం సాధించకపోయినా.. ప్రేక్షకులను అలరించింది. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకులకు కనెక్ట్ అయింది. ఇలా దసరా సీజన్‌లో వెంకటేష్ కు వచ్చిన సినిమాలను చూస్తే.. ఎక్కువ సందర్భాల్లో మంచి రిజల్ట్సే కనిపిస్తాయి. అందుకే ఇప్పుడు రాబోతున్న కొత్త సినిమాపై కూడా ఆ సెంటిమెంట్ చర్చగా మారింది. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో వెంకటేష్ నటిస్తున్న ఆదర్శ కుటుంబం ఈసారి దసరా బరిలోకి దిగేందుకు సిద్ధమవుతోంది. కుటుంబ కథతో పాటు యాక్షన్, కామెడీ ఎలిమెంట్స్ తో తెరకెక్కుతోంది. ముందు అక్టోబర్ 2న విడుదల చేయాలనే ఆలోచన ఉండగా.. దసరా సెలవులను యూజ్ చేసుకునేలా పండుగ వారంలో విడుదల చేయాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే వచ్చిన టీజర్ సినిమాపై హైప్ పెంచింది. త్రివిక్రమ్ డైలాగ్స్, వెంకటేష్ యాక్టింగ్ కలిస్తే ఎలా ఉంటుందనే ఆసక్తి అభిమానుల్లో కనిపిస్తోంది. పైగా దసరా సీజన్ వెంకీకి గతంలో మంచి రిజల్ట్స్ ఇచ్చిన సందర్భాలు ఉండటంతో అంచనాలు మరింత పెరుగుతున్నాయి. అయితే గత రికార్డులు కొత్త సినిమాకు విజయాన్ని ఫిక్స్ చేయవని చెప్పాలి. ఈసారి కథ, కామెడీ, వెంకటేష్ యాక్టింగ్, త్రివిక్రమ్ టేకింగ్ తో పాటు దసరా సెలవులను సినిమా ఎంతవరకు యూజ్ చేసుకుంటుందనేదే మెయిన్. గతంలో దసరా సెంటిమెంట్ ను సక్సెస్ గా మార్చుకున్న వెంకీ.. ఈసారి ఆదర్శ కుటుంబంతో ఆ జోష్ ను కంటిన్యూ చేస్తారా అనేది వేచి చూడాలి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com